www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 5-5-2024
Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

జడ్పీ సమావేశం వాయిదా

నెల్లూరు (జడ్పీ), మే 4: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయి దా పడింది. శనివారం జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో సమావేశం జరిగేలా నిర్వహించారు. అయితే, కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఛైర్‌పర్సన్‌ప్రకటించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి మూడు నెలలకోమారు జడ్పీ సమావేశం నిర్వహించాల్సి ఉంది. దీంతో సీఈవో కన్నమ నాయుడు సమావేశం ఏర్పాటు చేశారు. అయితే కేవలం నలుగురు జడ్పీటీసీలు, ఒక కో-ఆప్షన్ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. దీంతో సంఖ్యా బలం లేకపోవడంతో సమావేశం వాయిదా పడింది.

నేడు వైఎస్ షర్మిల పర్యటన

- కోవూరులో బహిరంగ సభ



నెల్లూరు (వైద్యం): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదివారం జిల్లాలో పర్య టించనున్నారు. కోవూరు నియోజక వర్గం కోవూరు బజారు సెంటర్‌లో జరిగే న్యాయయాత్ర బహిరంగ సభలో ఆమె పాల్గొననున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు షర్మిల జిల్లాలో ప్రచారానికి వస్తున్నారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు, ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొననున్నారు.

తుస్సుమన్న సిద్ధం!

- ఆకట్టుకోని సీఎం జగన్ ప్రసంగం
- ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితి
- బలవంతంగా దుకాణాల మూత
- మధ్యలోనే జనం జంప్!



నెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): సిద్ధం సభ తుస్సుమంది.. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభ జనాల్ని ఆకట్టుకోలేకపోయింది. నెల్లూరుకు ఏం చేశారో సీఎం స్పష్టంగా చెప్పలేకపోయారు. ఇక గతంలో ఇచ్చిన హామీల ఊసే ఎత్తలేదు. ప్రతిపక్షాలు మాయమాటలు, అబద్ధాలు చెబుతున్నాయని మాట్లాడుతూ జగన్ అబద్ధాలు చెప్పడంపై అక్కడున్న వారు ఆశ్చర్యపోయారు. సిద్ధం ఎన్నికల ప్రచార సభను శనివారం నెల్లూరు నగరంలో ఏర్పాటు చేశారు. అనుకున్న సమయం ప్రకారం మధ్యాహ్నం మూడు గంటలకు జగన్ నెల్లూరుకు రావాల్సి ఉన్నా గంటన్నర ఆలస్యంగా 4:30 గంటలకు చేరుకున్నారు. వీఆర్సీ మైదానం నుంచి గాంధీబొమ్మ వరకు రోడ్‌షో ఉంటుందని చెప్పినా, కారు దిగకుండా నేరుగా సభా వేదిక వద్దకు వెళ్లారు. దాదాపు 40 నిముషాలకుపైగా ప్రసంగించిన జగన్మోహన్‌రెడ్డి.. నెల్లూరు జిల్లాను ఏ విధంగా అభివృద్ధి చేస్తారో మాత్రం చెప్పలేదు. గత ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చామని జగన్ ప్రకటించగా, ఆ సమావేశానికి వచ్చిన పలువురు మహిళలు మద్య పాన నిషేధం ఎందుకు చేయలేదో నని మాట్లాడుకోవడం కనిపించింది. మరికొందరైతే 'అవునవును.. సీపీఎస్ రద్దు చేశారు, రాజధాని నిర్మించారు, ఉచిత ఇసుక ఇచ్చారు, డీఎస్సీ ఇచ్చారు, పోలవ రం పూర్తి చేశారు, రోడ్లను సుందరంగా తీర్చిదిద్దారు'.. అంటూ కామెంట్లు చేశారు. కాగా సభ జరుగు తుండగానే పలువురు వెనుదిరిగారు. సభ ముగిసే సమయానికి సభా ప్రాంతంలోని రోడ్లన్నీ వెలవెలబో యాయి. నెల్లూరు సభకు చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి కూడా జనాల్ని తీసుకొచ్చారు. ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చినట్లు అక్కడ చెప్పుకోవడం గమనార్హం.



బారికేడ్లు ఉన్నా పోలీస్ పహారా ఉండాల్సిందేనట!

● హామీల ఊసేది..?

జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన జగన్మోహన్‌రెడ్డి.. గతంలో జిల్లాకు ఇచ్చిన హామీల గురించి మాత్రం మాట్లాడలేదు. కనీసం జిల్లాలోని సమస్యలను కూడా ప్రస్తావించలేదు. ఆఖరుకు రేపు మళ్లీ అధికారంలోకి వస్తే ఏ విధంగా అభివృద్ధి చేస్తామో కూడా చెప్పలేదు. దీనిపై రకరకాల కామెంట్లు వినిపించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల ను విస్తరించినట్లు జగన్ చెప్పారు కానీ, జిల్లాలోని దగదర్తి వద్ద ఎయిర్‌పోర్టు పనులను ఎందుకు ఆపేశారో మాత్రం చెప్పలేదు. మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల పనులు జరుగుతున్నాయన్నారు. మరి జిల్లాలో ఆ పనులు ఎక్కడ జరుగుతున్నాయో ఎవరికీ తెలియలేదు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చామని జగన్ ప్రకటించారు.. కానీ నెల్లూరు జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేశారు.. ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు.. అన్నది మాత్రం చెప్పలేదు. అధికారుల లెక్కల ప్రకారం రూ.1300 కోట్ల భారీ పరిశ్రమలు మాత్రమే వైసీపీ హయాంలో జిల్లాలో ఏర్పాటైనట్లు చెబుతుండడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు జగన్ ప్రకటించారు.. మరి గత ప్రభుత్వం నిర్మించిన వేల టిడ్కో ఇళ్లను ఎం దుకు పేదలకు అప్పగించలేదన్నది మాత్రం స్పష్టం చేయలేదు.నెల్లూరులో భూగర్భ డ్రైనే జీ, తాగునీటి పథకాల పనులను ఐదేళ్లుగా ఎందుకు ఆపేశారో కూడా ఆయన సమాధా నం చెప్పలేదు. పెన్నా పొర్లుకట్లను ఏడాదిలో పు నిర్మించి వరద ముంపు నుంచి నగరవాసు లను కాపాడుతామని రెండేళ్ల కింద హామీ ఇచ్చిన జగన్.. ఇప్పుడు దాని ఊసే ఎత్తలేదు. సోమశిల జలాశయం అత్యంత ప్రమాదంలో ఉందని నిపుణుల కమిటీ హెచ్చరించినా దాన్ని గురించి అసలు మాట్లాడ లేదు. జిల్లాకు తలమానిక మైన కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌లో ఆప రేషన్స్ నిలిచిపోతే దాని గురించే ప్రస్తావనే లేదు.

● ప్రజలకు నరకం

జగన్ పర్యటన నేప థ్యంలో వీఆర్సీ నుంచి గాంధీబొమ్మ వరకు డివైడర్ ఎవరూ దాటకుండా బారి కేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో పొగతోటలోని ఆసుపత్రు లకు వచ్చిన రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలానే ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న వీధులకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎవరూ కూడా ఆ వీధుల నుంచి రాకుండా అడ్డుకున్నారు. ఇక మధ్యాహ్నం నుంచి వీఆర్సీ-గాంధీబొమ్మ మధ్యన రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాలను బలవంతంగా మూసివేయించారు. సాయంత్రం ఆరు గంటలకు జగన్ తిరుగుపయనమయ్యే వరకు దుకాణాలను తెరవనీయలేదు.



బారికేడ్ల ఏర్పాటుతో తప్పనిపాట్లు

నీట్ రూల్స్.. వెరీ టఫ్

- జిల్లాలో నేటి మధ్యాహ్నం పరీక్ష
- కఠిన ఆంక్షల మధ్య నిర్వహణ
- 4,500 మందికిపైగా విద్యార్థుల హాజరు
- 6 కేంద్రాల్లో నిర్వహణ



నెల్లూరు (విద్య), మే 4 : ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యు యేట్(నీట్-యూజీ) ప్రవేశ పరీక్ష ఆది వారం జరగనుంది. జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తు న్నారు. 4,500 మందికిపైగా విద్యార్థులు హాజరవు తున్నట్లు వివిధ కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. జిల్లాలోని అక్షర విద్యాలయం, వీఆర్ ఐపీఎస్, గీతాంజలి ఇంజనీరింగ్, కావలి ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, తడలోని పద్మావతి సీబీఎస్ఈ, గూడూరు శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కట్టుదిట్టమైన నిబంధనల నడుమ నీట్ నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. విద్యార్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష కేంద్రా లకు చేరుకోవాల్సి ఉంటుంది. వారిని పూర్తిగా పరిశీలించిన తర్వాతే పరీక్ష హాలులోకి అనుమతిస్తారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. అయితే వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తున్నట్లు నిర్వాహకు లు తెలిపారు. 1.30 గంటల తరువాత వచ్చిన విద్యార్థులను ఎట్టి పరిస్థి తుల్లోనూ అనుమతించరు. విద్యార్థులు నిబంధనలపై అవగాహన కలిగి ఉండి ఒత్తిడి లేకుండా పరీక్ష రాసి విజయం సాధించాలని నిపుణులు సూచిస్తున్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్



నెల్లూరు : పాదలకూరు రోడ్డులోని బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), మే 4: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నది. మంగళవారం వరకు ఈ ప్రక్రియను నిర్వహించనున్నారు. దీంతో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రారంభం అయినట్లే. జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు, అత్యవసర సేవల సిబ్బందికి అన్నీ నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటును ఈనెల 5,6,7 తేదీల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల లోగా వినియోగించు కోవచ్చు. సుమారుగా 20వేల మందికిపైగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారు.

● ఓట్ల కోసం వేట

ఈ ఎన్నికల్లో ఏదో రకం గా గెలి చేం దుకు, పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను ప్రలోభ పెట్టేం దుకు ప్రధాన రాజకీయ పార్టీల నేతలు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల ఫోన్ నెంబర్లను వారు సేకరిం చారు. వారికి ఫోన్లు చేసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

● ఒక రోజు క్యాజువల్ లీవ్ : కలెక్టర్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవడానికి ఈసీ ఒక రోజు క్యాజువల్ లీవ్ మంజూరు చేసిందని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆది, సోమ, మంగళవారాల్లో ఏదో ఒకరోజు వారు సెలవు తీసుకుని పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించు కోవాలన్నారు. అలాగే సర్వీసు ఓటర్లు కూడా నియోజక వర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కును వినియోగించుకోవచ్చనని వివరించారు. కాగా, నగరంలోని దర్గామిట్ట జడ్పీ హైస్కూల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించారు. ఈ స్కూల్లో గదుల ఏర్పాటు, వెబ్‌కాస్టింగ్ తదితర ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలకు పోస్టల్ బ్యాలెట్‌పై నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లు

అసెంబ్లీ నియోజకవర్గం	ఫెసిలిటేషన్ ఏర్పాటు చేసిన ప్రాంతం
కందుకూరు	జడ్పీ బాలికల హైస్కూల్, ఓవీ రోడ్డు
కావలి	జడ్పీ బాలుర హైస్కూల్
ఆత్మకూరు	ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ,
కోవూరు	పీఆర్ఎస్ ప్రభుత్వ బాలికల హైస్కూల్
నెల్లూరు సిటీ	డీకేడబ్ల్యూ కాలేజీ, నెల్లూరు
నెల్లూరు రూరల్	వీఆర్ లా కాలేజీ, నెల్లూరు
ఉదయగిరి	ప్రభుత్వ జూనియర్ కాలేజీ
తిరుపతి పార్లమెంట్ పరిధి - సర్వేపల్లి	క్యూబా ఇంజనీరింగ్ కాలేజీ
ఇతర జిల్లాల వారు	జడ్పీ బాలుర హైస్కూల్, దర్గామిట్ట, నెల్లూరు



బొల్లినేనితో మాట్లాడుతున్న సోమిరెడ్డి, బీద

మర్యాద ఇచ్చినా, ఇవ్వకున్నా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తా!

- టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని

ఉదయగిరి రూరల్, మే 4: అవతలి వ్యక్తి మర్యాద ఇచ్చినా ఇవ్వకున్నా టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని, తనకు టికెట్ రాకపోవడంపై మనస్థాపానికి గురైన మాట వాస్తవమేనని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు అన్నారు. శనివారం రాత్రి ఉదయగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్ల పార్టీకి సేవ చేసిన తాను పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పార్టీకి ద్రోహం చేసే మనస్తత్వం తనది కాదన్నారు. అవతలి వ్యక్తి గౌరవంగా పని చేయించుకోవాలని, కనీసం తనను నామినేషన్‌కు కూడా గౌరవంగా పిలవలేదన్నారు. మర్యాద ఇచ్చినా ఇవ్వకపోయినా అధినేత నిర్ణయానికి కట్టుబడి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు. నెల్లూరు పార్ల మెంట్, ఉదయగిరి అభ్యర్థుల విజయానికి ప్రతి మండల కేంద్రాల్లో ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయి తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నేతలు పొన్నెబోయిన చెంచ లబాబుయాదవ్, మేకపాటి శాంతకుమారి రియాజ్, బొజ్జా నరసిం హులు తదితరులు పాల్గొన్నారు.

● సోమిరెడ్డి, బీదలతో భేటీ

నెల్లూరులోని వేదాయపాళెంలోని టీడీపీ నేతలు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలతో బొల్లినేని రామారావు శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై వా రు సుదీర్ఘంగా చర్చించారు. ఉమ్మడి అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన చర్యలపై మంతనాలు సాగించారు.

గ్రావెల్‌పై ప్రతాపం!

- మండలానికో నేత.. మట్టి మేత!
- చెరువులను గుల్లచేస్తున్న మాఫియా
- కొండలు, ప్రభుత్వ, విమానాశ్రయ భూములనూ వదలని వైనం
- చేష్టలుడిగిన అధికార యంత్రాంగం
- అధికార పార్టీని వ్యతిరేకిస్తే వేధింపులు



కావలి, మే 4 : కంచె చేను మేసినట్లుగా ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన అధికారులే చేతులెత్తేసి అధికార పార్టీకి దాసోహం అంటున్నారు. కావలి నియోజకవర్గంలోని మండలా నికో నేతకు గ్రావెల్ అక్రమ దందాను వారు అప్పనంగా కట్టబె ట్టారు. ఆ నేత కనుసన్నల్లోనే గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగు తున్నాయి. అందులో వచ్చే ఆదాయాన్ని ముఖ్యనేతకు ముట్ట చెప్పాలి. ఆదాయం సరిగా ఇవ్వకపోతే మరోనేతకు అక్రమ దందాను అప్పగిస్తారు.

మౌనం వెనుక ఆంతర్యమేమిటి ?

కొండలు, చెరువులు, ఎయిర్‌పోర్ట్ భూములు, ప్రభుత్వ భూములు.. ఇలా వేటినీ వదలకుండా గ్రావెల్‌ను అధికార పార్టీ నేతలు అమ్ముకుంటున్నారు. ఈ విష యంలో అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటో అంతు పట్టడం లేదు. మామూళ్ల మత్తులో ఉన్నారా.. లేదా అధికార పార్టీ అంటే భయప డ్డారో... తెలియడంలేదు. గ్రావెల్ అక్ర మ దందాపై ప్రతిపక్షాలు ప్రశ్నించినా, పత్రికలు ఘోషించినా, ప్రజలు ఆందోళన చేపట్టినా స్థానిక అధికారు ల్లో మాత్రం స్పందనలేదు. ఒకవేళ స్థానికులు అడ్డుకుంటే వారిపై కేసులు నమోదు చేసి ముప్పతిప్పలు పెడుతున్నారు.

వ్యతిరేకిస్తే బెదిరింపులు

గ్రావెల్ తవ్వుతున్న అధికార పార్టీ నేతలకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లా డితే క్షణాల్లో వివిధ శాఖల అధికారులు అక్క డకు వాలిపోతారు. వారిని బెది రించి అధికారపార్టీకి అండగా ఉం డేలా చేస్తున్నారు. ఓ వైసీపీ నాయకుడు గ్రావెల్ అక్రమ వ్యాపారం చేస్తూ టీడీపీ లోకి వెళ్లేందుకు సిద్ధపడ్డాడు. విషయం తెలుసుకున్న అధికారపార్టీ నేతలు కావలిలో ఆ నేత మట్టి డంప్ వద్ద వాలిపోయి లెక్కలు తీశారు. భారీ స్థాయిలో అపరాధ రుసుము చెల్లించాలని అధికారుల చేత బెదిరించారు. ఇంకేముంది.. భయపడి పోయిన ఆ నేత కావలి ఎమ్మెల్యే వద్దకు వచ్చి తాను వైసీపీలోనే కొనసాగుతానని చెప్పాడు. దీంతో ఆయన్ను వదిలేశారు.



వెంగాయిగారిపాలెం రోడ్డులో దుమ్ము రేపుకుంటూ వెళుతున్న గ్రావెల్ ట్రిప్పర్

అక్రమ తవ్వకాలివిగో...

కావలి కూరల్ మండలం రుద్రకోట వద్ద ఉన్న పెద్ద తిప్పను కొల్లగొట్టి గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. గ్రామస్థులు అడ్డుకోగా వారిపై కేసులు పెట్టారు. ప్రతిపక్షాలు వెళ్లి గగ్గోలు పెట్టినా వారినీ లెక్కచేయ లేదు. అలాగే కావలి జగనన్న కాలనీల వద్ద ఉన్న పెద్దతిప్పను కూడా వైసీపీ నేతలు తొలిచి, ఆ గ్రావెల్‌తో బొంతరాయి గుంతలను పూడ్చారు. అలాగే దగర్తి విమానాశ్రయ భూములను సైతం వదలకుండా, అక్కడ పెద్ద పెద్ద గుంతలు తవ్వి గ్రావెల్‌ను నెల్లూరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారనే ప్రచారం సాగింది. కావలి నుంచి జిల్లాస్థాయి వరకు టీడీపీ నేతలు వెళ్లి ఆందోళనలు చేసి నా, అధికారులకు ఫిర్యాదులు చేసినా గ్రావెల్ అక్రమ రవాణా ఆగనేలేదు. దీంతో ఆభూములు భవిష్యత్తులో విమానాశ్రయానికి పనికిరావని భావించిన టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించగా, అప్పటికిగాని గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలేదు.

చెరువులు గుల్ల

ఇకపోతే కావలి పెద్దచెరువు, ముసునూరు పెద్దచెరువు, రుద్రకోట, సిరిపురం, కొత్తపల్లి, ఆర్సీపాలెం ఇలా గ్రావెల్ ఉన్న ఏ చెరువును వదలకుండా భారీగా గోతులు తీసి గుల్ల చేశారు. అలాగే బోగోలు మండలం కప్పరాళతిప్ప, అల్లూరు మండలం ఆములూరు, దగదర్తి మండలం కేకేగుంట.. ఇలా ఒకటేమిటీ ఎక్కడ గ్రావెల్ కనిపించినా అక్రమంగా తరలించి రూ. కోట్లు గడిస్తున్నారు. బిట్రగుంట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ట్రైబల్ శిక్షణ కేంద్రం కార్యాలయం వద్దచూస్తే దాని గోడ అంచున ఎంత లోతులో గ్రావెల్ తవ్వారో తెలుస్తుంది. ఇది ప్రతి అధికారికి తెలుసు. కాని ఎవరూ దానిపై చర్యలు చేపట్టలేదు. కాగా ఐదేళ్ల కిందట గూగుల్ మ్యాప్‌లు, ఇప్పుడి గూగుల్ మ్యాప్‌లను పరిశీలిస్తే ఎంత గ్రావెల్ అక్రమంగా తరలించారో ఇట్టే తెలిసిపోతుంది.

ఆత్మకూరు ఉదయగిరి

అధ్వానంగా పాపంపల్లి రహదారి



కంకర తేలి ప్రమాదకరంగా ఉన్న పాపంపల్లి రోడ్డు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 4: మండలంలోని పాపంపల్లి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వాన్నంగా ఉంది. గ్రామస్థులు ఇతరపనుల మీద వేరే గ్రామాలకు వెళ్లాలంటే కంకర తేలిన రోడ్డుపైనే ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఉంది. వాహనదారులు దేవు డెరుగు.. కనీసం పాదాచారులు నడిచేందుకు కూడా వీలులేకుండా ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్నిసార్లు ఈ రోడ్డులో వెళ్లే వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయపడుతున్నారు. మరికొందరు ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురి అవుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్డుపై తట్టెడు మట్టి కూడా వేసిన పాపానపోలేదంటే పాలకుల నిర్లక్ష్యం ఎంతో తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వలంటీర్ల రాజీనామా

ఉదయగిరి: శకునాలపల్లి, కృష్ణంపల్లి, దాసరిపల్లి, ఉదయగిరి-1 సచివాలయాల పరిధిలోని 12మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు.

కలువాయి: మండలంలో శనివారం మరో 16మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు.

ఎండుతున్న వరిపైరు

అనంతసాగరం: ఉప్పలపాడు, ముస్తాపురం వద్ద చేతికొచ్చిన వరి పంట నీరులేక ఎండుముఖం పడుతోంది. ఉత్తరకాలువ నుంచి 7ఆర్ ఉప కాలువ కింద 500 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. మరో 15రోజుల్లో పంట చేతి కందే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో సోమశిల నుంచి విడుదల చేసే నీరు నిలు పుదల చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని రోజులు నీరు ఇవ్వాలని ప్రాజెక్టు అధి కారు లను అడుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.



ఉప్పలపాడు సమీపంలోని వరిపైరు

ఇంటి వద్దే ఓటేసిన 104 ఏళ్ల బామ్మ



సిరా గుర్తును చూపుతున్న మలినేని పార్వతి వర్ధనమ్మ

సంగం, మే 4: పట్టణంలోని సాయినగర్‌కు చెందిన 104 ఏళ్ల వృద్ధురాలు మలినేని పార్వతివర్ధనమ్మ శనివారం ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1952 నుంచి ఓటు హక్కు వినియోగించుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఎన్నికల కమిషన్ 85ఏళ్ల దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. అధికారులు ఇంటి వద్దకే రావడంతో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. తనకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు ఓటును బాధ్యతగా భావించి ఓటు వేయాలని సూచించారు.

కిలో పొగాకు రూ.298

కలిగిరి, మే 4: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 579 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 14 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 528 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-33, ఆర్ఆర్-2, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 51 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.298, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.268.48గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

వైసీపీ పాలనలో దళితులకు ద్రోహం

● సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి

ఆత్మకూరు/వింజమూరు, మే 4 : 'వైసీపీ పాలనలో దళితలకు తీరని ద్రోహం జరిగింది. దళితులపై దాడులు, పోలీసు కేసులు పెచ్చుమీరాయి. ఎస్సీలు నా మేనమామలంటూ మాయమాటలు చెప్పిన జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహిగా మారాడు. దళితులంతా ఏకమై జగన్‌కు గుణపాఠం చెప్పాల్సిన రోజులు దగ్గర పడ్డాయి' అని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు, వింజమూరులలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయాలు చేస్తానని చెప్పి విధ్వంశపూరిత, కక్షపూరిత రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. దళితుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రవేశపెట్టబడిన అంబేడ్కర్ విదేశ విద్యా పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం, అంబేడ్కర్ స్టడీ సర్కిల్, భూమి కొనుగోలు పథకం తదితర 27 పథకాలను నిర్వీర్యం చేశాడని ధ్వజమెత్తాడు. వైసీపీ పాలనలో ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీలపైన జరిగిన దాడుల్లో జగన్ ఆల్ టైం రికార్డు సృష్టించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు జువాజీ ఫణీంద్రకుమార్, బండి కిరణ్‌కుమార్, దుంపల హరీష్, నాగేశ్వరరావు, హరీష్, పాల్‌విట్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ



బీరువాను ధ్వంసం చేసిన దొంగలు

మనుబోలు, మే 4: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో రాజనాల బ్రహ్మయ్య, మెడపల్లి వినోద్ ఇళ్లల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వేసవికాలంకా వడంతో బ్రహ్మయ్య, భార్య పిల్లలు ఇంటిపైన నిద్రిస్తుండగా చోరులు ఇంటిలోని బీరువా తలుపులు తీసి అందులో ఉన్న రూ. 10వేలు నగదు, రెండు జతల ఉంగరాలు, సెల్‌ఫోన్ తీసుకెళ్లారని బ్రహ్మయ్య వాపోయాడు. అలాగే మెడపల్లి వినోద్ ఇంట్లో చోరులు దొంగతనానికి పాల్పడి బీరువాలో ఉన్న జత కమ్మలు, రూ. 24వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లు పట్టుకెళ్లారని బాధితుడు వాపోయాడు. రెండు చోరీలపై పోలీసులకు ఫిర్యా దులు చేశారు. కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ : ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు



ఏఎస్‌పేట, మే 4: మండల కేంద్రం సమీపంలోని బీరాపేరు వాగు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనగా ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రం గా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగం మండలం పెరమన గ్రామానికి చెందిన తుమ్మల శివ (240 ఏఎస్‌పేట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. అదే సమయంలో హసనాపురం నుంచి ఏఎస్‌పేటకు వస్తున్న ఎస్టీ కాలనీకి చెందిన జేసీపీ ఆపరేటర్ మహేష్ మరో ద్విచక్ర వాహనంలో వేగంగా వస్తూ ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తుమ్మల శివ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్‌కి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి అతన్ని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	147
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	290
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6784
వెండి కిలో ధర	రూ. 82,600
వెండి ఒక గ్రాము	రూ. 84.60

సాగు, తాగునీటి సమస్య లేకుండా చూస్తా : కాకర్ల

జలదంకి, మే 4: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సాగు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటానని ఉదయగిరి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. శనివారం జలదంకి, గోపన్నపాలెం, కమ్మవారిపాలెం, చామదల పంచాయతీల్లో ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా కాకర్ల మాట్లాడారు. వైసీపీ పాలనలో నిలిచిపోయిన సాగునీటి కాలువల పనులు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల పనులు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా గట్టుపల్లిలో విద్యుత్‌బిల్లులు కట్టలేక మూసేసిన మంచినీటి పథకాన్ని తెరిపించి మండల ప్రజల దాహార్తిని తీరుస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు పి.మధురెడ్డి, చేవూరి జనార్దన్‌రెడ్డి, మందపల్లి మాల్యాద్రియాదవ్, ఏగూరి రఘు, మాదిరెడ్డి సుబ్బారెడ్డి, కూరపాటి మాలకండారెడ్డి, గంటా అశోక్, తమ్మినేని మల్లికార్జున, మారుబోయిన నారాయణ, పచ్చా పెంచలయ్యనాయుడు, పచ్చా మనీషాచౌదరి, మునగాల వెంకటేశ్వరరెడ్డి, దేవరపల్లి క్రిష్ణారెడ్డి, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

సీతారామపురం: సేవా దృక్పథం ఉన్న ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బోగినేని కాశిరావు, తెలుగుదేశం యూత్ లీడర్ దేవర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సీతారామపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సీఎంగా చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో చెప్పినవన్నీ అమలు చేస్తారన్నారు. తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఏటా రూ.15వేలు, దీపం పథకం కింద ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, 18నుండి 59ఏళ్ల వయసున్న మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేస్తామన్నారు. అలాగే వృద్ధాప్య పెన్షన్ రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని, ప్రతినెలా 1వ తేదీన వారి ఇంటి వద్దకే అందజేస్తామ న్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రా లు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. తోట మాల్యాద్రి, జయరాములు, తమ్మిశెట్టి రమణయ్య, వార్డు మెంబర్ తోట మనోజ్, బండి రవి, తోట ఏడుకొం డలు, బాష, కిష్ట సుబ్బరాయుడు, విఠల నారాయణ, పిడుగు రాహుల్ పాల్గొన్నారు.

వింజమూరు: ఎర్రబెల్లిపాలెంలో టీడీపీ నా యకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచా రంలో కాకర్ల సురేఖ పాల్గొని ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్, పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలి పించాలని కోరారు. ఇంటింటికి తిరిగి కరపత్రా లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి పాల్గొన్నారు.



కమ్మపాలెంలో గజమాలతో కాకర్లను సత్కరిస్తున్న గ్రామస్థులు



కాకర్లను సన్మానించిన గిరిజనులు



వింజమూరు: ఇంటింటి ప్రచారంలో కాకర్ల సురేఖ



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆత్మకూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా: ఆనం

అనంతసాగరం, మే 4: టీడీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం గోవిందమ్మపల్లి, పాతాళపల్లి, ముస్తాపురం, మంచాలపల్లి, వరికుంటపాడు, ఉప్పలపాడు, కమ్మవారిపల్లి, పడమటి కంభంపాడు, సోమశిల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి నుండి 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, దీపం పేరుతో ఏడాదికి ఉచితంగా 3గ్యాస్ సిలిండర్ల పంపిణీ, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ 15వేలు సాయం, యువతకు 20లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3వేల నిరుద్యోగభృతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో నెల్లూరు మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, కర్నాటి ఆంజనేయరెడ్డి, అనంతసాగరం మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత, మాజీ ఎంపీపీ సుబ్బరాజు, పాతపాటి మదుసుదన్‌రెడ్డి, సంజీవ్‌రాజు, చల్లా శివారెడ్డి, తిరుపతినాయుడు, రాపూరు సుజాతమ్మ పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు చారిత్రక అవసరం

ఆత్మకూరు: ఈసారి జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు చారిత్రక అవసరమని, ఎన్డీఏ కూటమి టీడీపీ అభ్యర్థులు ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆనం రంగమయూరరెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు 19వ వార్డు పరిధిలోని శివాలయం వీధి ప్రాంతాల్లో ఆయన టీడీపీ, బిజెపి నేతలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటిటింటి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివ రించి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సా ధ్యమని పేర్కొన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని విమర్శించారు. కార్యక్రమం లో టీడీపీ నాయకుడు చల్లా రవికుమార్‌రెడ్డి, బీజేపీ అను బంధ సంఘాల నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటం పాటి సుధాకర్ పాల్గొన్నారు.

సంగం: టీడీపీ గెలుపు రాష్ట్ర అభివృద్ధికి మలుపని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మండలంలోని మర్రిపాడులో ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆనం రామనారాయణరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయం కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేశారని విమర్శించారు. ఒక్కఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో సర్వనాశనం చేశారన్నారు. మోదీ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేస్తారని తెలిపారు.

హసనపురంలో ప్రచారం

ఏఎస్ పేట: ఎన్‌డీఏ కూటమి నాయకులు హసనపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిలను గెలిపంచాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, కల్లూరు రవీంద్రరెడ్డి, బీజేపీ మండలా ధ్యక్షుడు చెంచురెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆనం రంగమయూరరెడ్డి



అనంతసాగరం ఎన్నికల ప్రచారంలో ఆనం రామనారాయణరెడ్డి

వెంకటగిరిలో కురుగొండ్ల గెలుపే మా లక్ష్యం



తోపుగుంట అగ్రహారం ప్రచారంలో టీడీపీ శ్రేణులు

కలువాయి, మే 4: వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ గెలుపే లక్ష్యంగా తోపుగుంట అగ్రహారంలో శని వారం టీడీపీ నాయకులు ఎన్నకల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుపై ఓటు వేసి కురుగొండ్ల రామకృష్ణకు అత్యధిక మెజారిటీ సాధించాలని కోరారు. చంద్రబాబునాయుడు సీఎం అయితేనే చదువుకున్న బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయన్నారు. టీడీపీ ప్రక టించిన సూపర్ సిక్స్ పథకాలు, బీసీలకు 50ఏళ్లకే పింఛన్లు టీడీపీ అధికారంలోని వచ్చిన వెంటనే అమలు చేస్తారని తెలిపారు. వారి వెంట గంగవరపు చంద్రమౌళి, హరిబాబు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఏర్పాట్లు

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల విధులకు వెళ్లే ఎన్నికల అధికారులు, సిబ్బంది తమ ఓటుహక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఈ నెల 5, 6, 7వ తేదీల్లో వినియో గించుకోవచ్చని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ శనివారం తెలిపారు. అందుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేం ద్రంలో అన్నిఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గం పరిధిలోని 2,336 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది అందరూ ఆయా తేదీల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే నియోజకవర్గంలో 85ఏళ్లపై బడిన వారు, దివ్యాం గులు హోం ఓటింగ్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగిం చుకునేందుకు 173మందిని గుర్తించామని, అందులో 71మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు.

మోటారు బైక్ ఢీకొని పాదచారుడికి తీవ్రగాయాలు

సంగం, మే 4: మండలంలోని ముంబాయి జాతీయ రహదారి సమీపంలోని దువ్వూరు వద్ద నడిచి వెళుతున్న ఓ పాదచారుడిని వెనుక నుంచి మోటారు బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో పాదచారుడికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన నరసయ్య దువ్వూరు వచ్చి నడిచి వెళ్తుండగా ఉదయగిరికి చెందిన కృష్ణ అనే యువకుడు మోటారు బైక్‌పై బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్నాడు. ఈ సమయంలో నరసయ్యను వచ్చి ఢీకొన్నాడు. తీవ్రగాయాలైన నరసయ్యను 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సోమశిలలో 8.087 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 4: సోమశిల పూర్తిస్థాయి సామర్థ్యం 77.988 టీఎంసీలు. శని వారానికి జలాశయంలో 8.087 టీఎం సీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపా రు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రహదారి విస్తరణలో బస్‌షెల్టర్ మాయం!

● ఎండలో ప్రయాణికుల పడిగాపులు

కలిగిరి, మే 4: కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కలిగిరిలోని తహసీల్దారు కార్యాలయ కూడలిలో ఉన్న బస్‌షెల్టర్ కూల్చివేశారు. ఈ క్రమంలో ఐదు నెలలుగా ఈ ప్రాంతం నుంచి ప్రయాణించే ప్రయాణికులు కనీసం తలదాచుకోవడానికి కూడా నీడలేకపోవడంతో ఎండలోనే నిలబడి బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. తహసీల్దారు కార్యాలయ కూడలి నుంచి కావలి, నెల్లూరు, ఉదయగిరి, కొండాపురం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు స్థానికంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు నిత్యం వందలాదిమంది ప్రయాణాలు సాగిస్తుంటారు. గతంలో ఈ కూడలి ప్రాంతంలో బస్ షెల్టర్‌తోపాటు పెద్ద పెద్ద చెట్లు ఉండటంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవికాదు. రహదారి విస్తరణ పుణ్యమా అని ఇళ్లు, చెట్లు, బస్ షెల్టర్ తదితర అన్ని కూల్చివేయడంతో ఈ ప్రాంతం ఎడారిగా మారింది. ప్రస్తుతం ఎండలు తారెతిస్తున్న సమయంలో కనీసం ఈ ప్రాంతంలో నిలబడటానికి కాసింత నీడలేకపోయేసరికి ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనులు చేసే కాంట్రాక్టర్లు బస్‌షెల్టర్ ఉన్న ప్రాంతంలో తాత్కాలిక షెల్టర్ ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.


బస్సుల కోసం ఎండలో నిరీక్షిస్తున్నప్రయాణికులు

పోస్టల్ బ్యాలెట్‌తోనే జగన్‌కు షాక్ ఇవ్వాలి : వంటేరు


సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు

కావలి, మే 4: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లను వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్ని ఇబ్బందులు పెట్టారో వాటిని గుర్తించుకుని 5, 6, 7 తేదీలలో కావలిలో జరిగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఉద్యోగులు జగన్‌కు తమ ఓటు ద్వారా షాక్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జండా చెట్టు ప్రాంతంలో ఉన్న టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగులు లేక పోతే ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని, అలాంటి ఉద్యోగులనే జగన్ తన పాలనలో ఎలా హింసించారో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతోనే జగన్‌కు మైండ్ బ్లాక్ అయ్యేలా తీర్పు ఇవ్వాలన్నారు. ఎన్నికల డ్యూటీకి వెళ్లని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు మే 13న జరిగే పోలింగ్‌లో తమ ఓటు ద్వారా జగన్‌కు తగిన బుద్ధి చెప్పి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. జగన్ వైసీపీ మేనిఫెస్టోలో ఉద్యోగులకు అనుకూలంగా ఒక్క అంశం చేర్చలేదంటే మీ పట్ల ఆయన కక్ష సాధింపు ఎలా ఉందో అర్థం చేసుకుని ఓటు వేయాలన్నారు. కరోనా సమయంలో ప్రజలను తాము కాపాడామని వైసీపీ ప్రభుత్వం చెపుతోందని అక్కడ ఉద్యోగస్థులే వారి ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కు సేవలందించారన్నారు. ఆరోగ్యశాఖ ఉద్యోగులైతే ప్రాణాలపై ఆశలు వదులుకుని ప్రజలకు సేవలందించారన్నారు. ఇలాంటి ఉద్యోగులను జగన్ ముప్పతిప్పలు పెట్టిన విష యం మరచిపోరాదన్నారు. అంగన్ వాడీలు 43 రోజులు ఆం దోళన చేస్తే వారిని పట్టించుకోలేదన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని ఓటు వేయాలన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం, టీడీపీ నేతలు అశోక్‌రెడ్డి, చేవూరు అజయ్‌కుమార్ రెడ్డి, కుట్టుబోయిన రాజా పాల్గొన్నారు.

కూటమితోనే యువత భవిష్యత్‌కు గ్యారెంటీ

అల్లూరు, మే 4 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపుతోనే యువత భవిష్యత్‌కు గ్యారెంటీ ఉంటుందని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి అన్నారు. అల్లూరు 10వ వార్డులో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు చరణ్‌రెడ్డితో కలసి శనివారం ఆయన ఇంటిం టా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్, మేనిఫెస్టోలని పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుల్లా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, రాచూరు శ్రీనివాసులు, సామంతుల పరంధామరెడ్డి, పాపాల విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న బినీత్‌రెడ్డి, చరణ్‌రెడ్డి

మాలకొండ ఆదాయం రూ.8,95,963

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.8,95,963 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌లకు రూ.5,850, కుంకుమార్చనకు రూ.22,680, వివాహముల ద్వారా రూ.1,000, తలనీలాలు సమర్పణకు రూ.52,575, వాహన పూజలకు రూ.2,500, ప్రత్యేక దర్శనానికి రూ.2,46,600, స్థలపురాణం పుస్తకాలకు రూ.700, రూము అద్దెలు రూ.33,120, కవర్లు విక్రయానికి రూ.6,600, లడ్డూ ప్రసాదానికి రూ.2,12,890, అన్నదానం ద్వారా రూ.3,01216, విరాళములు రూ.10,232 వచ్చినట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రాగా మార్చిన ఘనుడు జగన్

● కందుకూరు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ● పలు గ్రామాల నుంచి భారీగా టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


లింగసముద్రం : టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో ఇంటూరి


కందుకూరు : ఇంటూరి సమక్షంలో టీడీపీలోకి వైసీపీ నాయకులు

లింగసముద్రం, మే 4 : ఒక్క చాన్సంటూ అధికారంలోని వచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రాగా మార్చిన ఘనుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి అని, మరో చాన్సిస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తాడని కందుకూరు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని గంగపాలెంలో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు త్రోవగుంట వెంగళరావు అధ్యక్షతన జరిగిన ఎన్నికల ప్రచార సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కూటమి అభ్యర్థులైన తనకు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన బీరంశెట్టి పేరయ్య, చిరుమామిళ్ల శింగయ్య, రాపూరి శ్రీను, రాపూరి సుబ్బారావు, సాదినేని మాలకొండయ్య, స్వర్ణ ముసలయ్య, చిన్నయ్య, మరో 20 మందికి పైగా ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరారు. నాగేశ్వరరావు వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అత్తంటి వెంకట్రావు, రంగయ్య, గనిపినేని బ్రహ్మయ్య, చిరుమామిళ్ల శ్రీనివాసులు, కిలారి కొండయ్య, చిరుమామిళ్ల బ్రహ్మయ్య, గొర్రెపాటి పెద చెంచురామయ్య, కంచర్ల మాలకొండయ్య, చిరుమామిళ్ల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● రాక్షస పాలనను సాగనంపండి

రాష్ట్రంలో రాక్షస పాలనను సాగనంపేందుకు రాబో యే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎన్డీఏ కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంలు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి మండలంలోని వీఆర్ కోటలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడుతూ, రాజ్యాంగ బద్ధంగా పాలన సాగించే ఎన్డీయే కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైసీపీ నాయకుడు ముప్పరాజు అంజయ్య, సొసైటీ అధ్యక్షుడు మన్నం శ్రీనివాసరావు, మన్నం శివరామయ్య, వింజం నరసయ్య, పాటిబండ్ల మాలకొండయ్య మరో 65 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి నాగేశ్వరరావు, శివరాంలు పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంకాయల పాటి మాల్యాద్రి, మాజీ సర్పంచు ముప్పరాజు లక్ష్మీనరసింహం, బోయిళ్ల కొండపనాయుడు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● మాలకొండరాయునిపాలెంలో...

మండలంలోని మాలకొండరాయునిపాలెంలో కందుకూరు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. గ్రామంలోని వైసీపీకి చెందిన చావా నరసయ్య, తిరుపతయ్య, రమణయ్య, వెంకటసుబ్బయ్య, అభిలాష్‌తో పాటు మరికొందరు టీడీపీలో చేరగా నాగేశ్వరరావు వీరికి పసుపు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమ కుమారి, మాధవరపు రమణయ్య, బొల్లినేని నాగేశ్వర రావు, పొంకం బ్రహ్మయ్య, ఎం నరసింగరావు, చేబ్రోలు మాలకొండయ్య, ఉన్నం వీరాస్వామి పాల్గొన్నారు.

టీడీపీ గూటికి వైసీపీ శ్రేణులు

కందుకూరు : నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు క్యూ కడుతున్నారు. శనివారం కందుకూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అనేక గ్రామాలలో వైసీపీ శ్రేణులు ఆపార్టీని వీడి టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పట్టణంలోని గుర్రంవారిపాలెంకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు దామా వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి సుబ్బారావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉప్పుటూరి సుబ్బారావు(మిల్క్), రమేష్, అంజయ్య, తదితర కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఇంటూరి నాగేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మండలంలోని పలుకూరులో టీడీపీ బలం రోజురోజుకి పుంజుకుంటోంది. ఇప్పటికే ఆ గ్రామంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరగా శనివారం మరికొందరు వైసీపీ కార్యకర్తలు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈదర సింగయ్య, వెంకటరావు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, షేక్ రహంతుల్లా తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నార్నె రోశయ్య పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

ఉలవపాడు : మహిళల గౌరవించే టీడీపీని గెలిపించుకుందామని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి సౌజన్య మహి ళా ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఉలవపాడు పంచాయతీ పరిధిలోని కొల్లూరుపాడు, ఎస్సీ బీసీ యాదవ కాలనీ, ఉలవపాడు ఎస్సీ మాదిగపాలెం, అంబేద్కర్ నగర్‌లలో సుడిగాలి పర్యటన చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు, మేనిఫెస్టోను వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కందుకూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇం టూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆమె వెంట నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమకుమారి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.


కందుకూరు : టీడీపీలో చేరిన పలుకూరు వాసులు

లక్షలు వెచ్చించారు...
అసంపూర్తిగా వదిలేశారు..!

● కందుకూరులో శిథిలమవుతున్న ఇండోర్ స్టేడియం
● నెరవేరని లక్ష్యం, క్రీడలకు దూరంగా యువత

కందుకూరు, మే 4: వైసీపీ విధ్వంసక పాలనకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది కందుకూరులోని ఇండోర్ స్టేడియం. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఇండోర్ స్టేడియంను రాష్ట్ర ప్రభుత్వ తిరోగమన చర్యలలో భాగంగా అసంపూర్తిగా వదిలేయడంతో ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుతోంది. సగానికి పైగా పనులు పూర్తయినప్పటికీ పనులు జరగని జాబితాలో రద్దు చేయడంతో అది శిథిలభవనంగా మారిపోయింది. భవనం లోపల మొక్కలు మొలిచి ఈ ఐదేళ్లలో అవి వృక్షాలుగా మారాయి. అలాగే వదిలేస్తే కొంతకాలం గడిస్తే భవనం ఆనవాళ్లు కూడా దెబ్బతినిపోయే ప్రమాదం కనిపిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం కందుకూరు మున్సిపాలిటీకి 2 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఇండోర్ స్టేడియంను మంజూరు చేసింది. వివిధ రకాల


అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం

ఇండోర్ క్రీడలతో పాటు జిమ్, ఇతర వ్యాయామాలకు అనుకూలంగా ఉండేవిధంగా స్టేడియం నిర్మాణానికి సంకల్పించి నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో పట్టణంలోని ఉన్నత పాఠశాలల క్రీడాప్రాంగణంలో దీని నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఎన్నికలకు ముందే సగానికి పైగా పనులు పూర్తయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 25 శాతం లోపు జరిగిన పనులన్నింటినీ ఒక్క జీవోతో రద్దు చేయడంతో అందులో ఇండోర్ స్టేడియం కూడా రద్దయిపోయింది. అప్పటికే 50 శాతం పనులు జరిగినప్పటికీ 25 శాతం లోపు పనులు జరిగినట్లు చూయించి రద్దు చేసేశారు. దీంతో ఆ పనులు చేసిన కాంట్రాక్టరు బిల్లులు రాక ఇబ్బందిపడటమే గాక ఇండోర్ స్టేడియం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ క్రమంలో యవతను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం నెరవేరకపోగా యువత క్రీడలకు దూరంగా మిగిలిపోయారు. రానున్న పాలకులైనా ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పూర్తిచేయించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని ప్రజలకు క్రీడాప్రాంగణాన్ని అందుబాటులోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

కూటమిది దమ్మున్న మేనిఫెస్టో

కందుకూరు, మే 4: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో పేదలకు ఎంతో మేలుచేసే దమ్మున్న మ్యానిఫెస్టోగా సామాన్యులు సైతం గుర్తించారని, ఇదే సమయంలో వైసీపీ మ్యానిఫెస్టోలో పసలేదని పెదవి విరుస్తున్నారని టీడీపీ ముస్లిం మైనారిటీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో దోపిడీనే లక్ష్యంగా జగన్ అవినీతి పాలన సాగించి రాష్ట్ర ఖజానాను దివాళా తీయించాడని, రానున్న టీడీపీ ప్రభుత్వంలో అవినీతిని అరికట్టడం ద్వారా మేనిఫెస్టోలో పేర్కొన్న సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయటంతో పాటు అభివృద్ధిలోను ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబునాయుడు అగ్రస్థానంలో నిలుపుతాడని ఆకాంక్షించారు. టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నాగేశ్వరరావులను గెలిపించేందుకు ప్రజలంతా మానసికంగా సంసిద్ధులై ఉన్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

జలదంకి, మే 4: మాజీమంత్రి దివంగత కలికి యానాదిరెడ్డి ప్రియ శిష్యుడు, విద్యావేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జలదంకికి చెందిన వేలమూరి శివశేఖర్‌రెడ్డి శనివారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గత 30 ఏళ్ల నుంచి పార్టీలో ఉంటూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, జిల్లా సభ్యుడి పదవుల్లో పార్టీ సంక్షోభకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉంటూ వచ్చిన శేఖర్‌రెడ్డి ఎన్నికల ససమయంలో పార్టీకి దూరమవడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వ్యక్తిగత కారణాలతో పార్టీని వీడినట్లు ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి కోసం సైకిల్ గుర్తుకు ఓటేయండి

● ఒక్క అవకాశంతో వ్యవస్థలన్నీ నిర్వీర్యం ● ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డుకట్ట వేద్దాం ● కావలిలో కావ్య, బీద రవిచంద్ర ప్రచారం


క్రిష్ణారెడ్డి, రవిచంద్రలను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు


28వ వార్డులో పర్యటిస్తున్న క్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు

కావలి, మే 4: సైకిల్ గుర్తుకు ఓటేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి తెలిపారు. బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులతో కలిసి శనివారం ఉదయం కావలి పట్టణంలోని 27, 28, 30, 32వ వార్డులలో, సాయంత్రం టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్రతో కలిసి 33, 34, 37, 40వ వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తూ కూటమి మేనిఫెస్టోతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ కావలిలో ఉన్న అరాచకస్థితి తొలగాలన్నా, శాంతియుత వాతావరణం ఉండాలన్నా, ప్రజలు స్వేచ్ఛగా జీవించాలన్నా, కమీషన్ల సంస్కృతి పోయి ప్రభుత్వ కార్యాలయాలలో సమయపాలనతో పనులు జరగాలన్నా తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. అప్పుడు ఎమ్మెల్యే అరాచకపాలనకు అడ్డుకట్ట వేద్దామన్నారు. వెంగళరావునగర్ 100 అడుగుల రోడ్డుతో ఫైర్ ఆఫీస్‌రోడ్డును అనుసంధానం చేసి కచ్చేరిమిట్ట ప్రాంతాన్ని వ్యాపారకేంద్రంగా మారుస్తానన్నారు. పట్టణంలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మాణం తదితర మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి సరైన నిర్వచనం చెపుతానన్నారు.


33వ వార్డులో చైతన్యరథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న క్రిష్ణారెడ్డి, పక్కన బీద రవిచంద్ర

● ఒక్క అవకాశంతో వ్యవస్థలను నిర్వీర్యం చేశారు : బీద

ఒక్క అవకాశం పేరుతో రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి అరాచకపాలన అందించిన ఘనత జగన్‌దే నన్నారు. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఇదే ఆఖరి ఘట్టమన్నారు. సంక్షేమాన్ని తీసుకువచ్చింది తెలుగుదేశం పార్టీయేనని, అందుకు ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారంటూ ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను, సంస్కరణలను ప్రస్తావించారు. అదే ఒరవడిని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే తొలిసంతకం మెగా డీఎస్సీపైనే పెడతారని, రెండో సంతకం ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుపై పెడతారన్నారు. కూటమి మేనిఫెస్టో హామీలు పాశుపతాస్త్రాలుగా అభివర్ణిస్తూ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్, మన్నవ రవిచంద్ర, జ్యోతి బాబూరావు, మొగిలి కల్లయ్య, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, బీజేపీ నేతలు సీవీసీ సత్యం, జీ. భరత్‌కుమార్, అంచిపాక కమల, కే. బ్రహ్మానందం, పూనూరు మాదవి, మందా కిరణ్, జనసేన నాయకులు పొబ్బా సాయి విఠల్, సమ్మన వెంకటసుబ్బయ్య, ఆలా శ్రీనాథ్, ఆయా వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

కావ్య సోదరుడి ప్రచారం

బిట్రగుంట : బోగోలు మండలంలో తెలుగుతమ్ముళ్లు ఇంటింటి ఎన్నికల ప్రచారం శనివారం వేర్వేరుగా నిర్వహించారు. కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బోగోలు కుమ్మరవీధి, ఎస్సీకాలనీ, అరవపాలెం, బృందావనం తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచార నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, భోగిరిప్రభాకర్‌లు చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. వారితో పాటు గనిపినేని నాగరాజు, ప్యాట్రిక్, మేకల వేంకటేశ్వర్లు, పోతల శ్రీనివాసులు, అర్పత్‌రాజ్, పుచ్చకాయల రమేష్, గుర్రంకొండ వాసు, ఉన్నారు. అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎల్.సుధీర్‌బాబు, ఫైడి హర్ష, దాసరి శ్రీనివాసులు ఉన్నారు. కాగా కొందరు వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

● దగదర్తి మండలం పెద్దపుత్తేడు, దళితవాడలో శనివారం ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహిచారు. చంద్రబాబు నాయుడు పేదల కోసం ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్ర భవిష్యతును దృష్టిలో పెట్టుకుని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిని సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.


బిట్రగుంట : టీడీపీలోకి చేర్చుకుంటున్న వేణుగోపాల్‌రెడ్డి

కాకర్ల గెలుపు కోసం ముమ్మర ప్రచారం

కొండాపురం, మే 4: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపు కోసం మండలంలో టీడీపీ నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. శనివారం సాయిపేట పంచాయతీలోని వెల్లటూరివారిపాలెంలో కావలి ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గంటా లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో, నేకునాంపేట పంచాయతీలో బూతు కన్వీనర్లు మామిళ్లపల్లి ప్రభాకర్, పల్లపోతు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు జాగర్లమూడి రామారావు, మామిళ్లపల్లి వెంకటరమణయ్య, కొమ్మి ప్రభాకర్, ఓరుగంటి సుమన్, మాల్యాద్రి, ఉదయగిరి మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

విట్స్ అధ్యాపకురాలు సురేఖ కుమారికి డాక్టరేట్



కావలిటౌన్, మే 4: విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ అధ్యాపకురాలు సురేఖకుమారికి ఎస్‌వీ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. కామర్స్ విభాగానికి చెందిన రీసెర్చ్ స్కాలర్ సురేఖ కుమారి ఫైనాన్షియల్ పర్‌ఫార్మెన్స్ ఆఫ్ పబ్లిక్ సెక్టార్ ప్రైవేట్ బ్యాంక్స్ అనే అంశంపై ప్రొఫెసర్ రామకృష్ణయ్య పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ, అధ్యాపకులు తదితరులు సురేఖను అభినందించారు.

7న సినీ హీరో నారా రోహిత్ రాక

కందుకూరు, మే 4: సినీ హీరో నారా రోహిత్ టీడీపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఈనెల 7న కందుకూరు వస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఆరోజు సాయంత్రం కందుకూరులో బహిరంగ సభలో పాల్గొంటారని, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, నందమూరి, నారా అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

లోవోల్టేజీతో తిరగని ఫ్యాన్లు

● ఉక్కపోతతో అల్లాడుతున్న జనం

జలదంకి, మే 4: మండే ఎండలకు తోడు లోవోల్టేజీ జలదంకి ప్రజలను ఉక్కపోతకు గురిచేస్తోంది. గ్రామంలోని చావిడి సెంటర్ నుంచి ఆంధ్రాబ్యాంకు వీధి వరకు గత కొన్ని రోజులుగా లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమై ఫ్యాన్లు కూడా తిరగక ఉక్కపోతతో అల్లాడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సమస్యను ట్రాన్స్‌కో సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను తీర్చి ప్రజలను ఉక్కపోత నుంచి కాపాడాలని కోరుతున్నారు.

డ్రమ్ము కొడుతూ ప్రత్యేక ఆకర్షణగా..

కావలి, మే 4: కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి శనివారం పట్టణంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో టీడీపీ నేత తిరువీధి ప్రసాద్ డ్రమ్ము కొడుతూ.. డ్యాన్స్ వేస్తూ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. డప్పు వా యిద్యాలతో ప్రచారం సాగుతుండగా కళాకారుల వద్ద ఉన్న డ్రమ్ము తీసుకుని ఆయన వాయి స్తూ డ్యాన్స్ వేయడం ఆకట్టుకుంది.


డ్రమ్ము కొడుతున్న తిరువీధి ప్రసాద్


'కూటమి'కి మద్దతుగా బీజేపీ ప్రచారం

కందుకూరు, మే 4: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా శనివారం పట్టణంలోని నందావారి వీధి, కనుమళ్ల వారి వీధులలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి తరపున నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులకు సైకిల్ గుర్తుపై ఓటువేసి విజయంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు, సీనియర్ నాయకులు ముప్పల భూషయ్య, నవులూరి రాజేష్, మహిళా నాయకురాలు దార్ల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆంధ్రజ్యోతి
జన కేతనం

అన్నీ ఫోన్లో వద్దులే.. వాట్సప్ కాల్ చేస్తా!



ఫోన్ ట్యాపింగ్ ఎఫెక్ట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చాలామంది తమ స్నేహితులు, బంధువులు, సన్నిహితులతో మనసువిప్పి ప్రశాంతంగా మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వ్యవహారంలో ఫోన్ ట్యాపింగ్ ఉదంతం ఆ రాష్ట్రాన్ని కుదిపేసింది. ఐపీఎస్ అధికారులు సైతం జైలుకు వెళ్లేలా చేసింది. అదే ఫీవర్ ఇక్కడా పట్టుకుంది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు అనేక ఇతర సంఘాల నాయకులు ఫోన్లో మాట్లాడేందుకు భయపడుతున్నారు. ఎవరు ఫోన్ ట్యాపింగ్‌లో ఉందో.... ఎవరి ఫోన్‌కాల్ రికార్డ్ అవుతుందో... మరెవరి ఫోన్‌స్పీకర్ ఆన్‌లో ఉందో నంటూ భయాభ్రాంతులకు గురవుతున్నారు. ఫోన్‌కాల్ కంటే వాట్సప్ కాల్ ఉత్తమమని భావించిన అనేకమంది ఈ విధానాన్నే పాటిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వాట్సప్ కాల్స్‌లోనే ఎక్కువ మాట్లాడుకుంటున్నారు.

- నెల్లూరు రూరల్

ఆంధ్రజ్యోతి సిత్రాలు

సైరా జోడెడ్ల బండి!



ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ జలదంకి మండలం కమ్మపాళెంలో ఎడ్లబండిపై హల్‌చల్ చేశారు. తన తనయుడు సంహిత్‌ను వెంటబెట్టుకుని ఎడ్లను అదిలిస్తూ సురేష్ ముందుకు సాగారు. ఇది ఓటర్లను ఎంతగానో ఆకట్టుకుంది.

- జలదంకి

అవ్వా పెన్షన్ వస్తోందా!?



అవ్వా పెన్షన్ వస్తోందా!? సమస్యలేమైనా ఉన్నాయా!? అంటూ కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి తనయ సంహితారెడ్డి వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తన తండ్రిని గెలిపించాలని కోరుతూ శనివారం కావలి 15వ వార్డులో ఆమె ప్రచారం చేశారు.

- కావలి టౌన్

పెరిగిన జంప్ జిలానీలు



సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు జంప్ చేస్తున్నారు. తమ పార్టీలో చేరేవారికి నిత్యం కండువాలు కప్పడానికే అభ్యర్థులకు సగం సమయం సరిపోతుంది. ప్రధాన పార్టీలకు చెందిన కొందరు స్థానిక నాయకులు అవతలి పార్టీ కార్యకర్తలను, ఓటర్లను తమ పార్టీ అభ్యర్థుల వద్దకు తీసుకెళ్లి, వారి గురించి గొప్పలు చెప్పి పార్టీ కండువాలు వేయిస్తున్నారు. మరోవైపు వీరంతా కోవర్టులే అన్న భయం కూడా వారిని వెంటాడుతుంది.ఈ జంప్ జిలానీలపై ఓ కన్నేసి ఉండాలని విశ్లేషకులు అంటున్నారు.

- పలేటివారిపాలెం

ఎన్నికల ప్రచారంతో ఉపాధి

పని దొరికిందోచ్



ఎన్నికల ప్రచారం కొందరికి ఉపాధినిస్తోంది. రెండు గంటల ప్రచారానికి వస్తే రూ. 200 ఇస్తామని ప్రధాన పార్టీల నేతలు పల్లెజనాలను తీసుకు వెళుతున్నారు. ఎండాకాలం కాబట్టి సాయంత్రం రెండు గంటలు వచ్చి మాతో తిరగండి.. మీరు చేయా ల్సింది ఏం లేదు.ఓట్లు అభ్యర్థించడానికి వెళుతున్న అభ్యర్థి వెంట ఉండడమేనని ... ఖాళీగా ఉన్న జనానికి చెప్పి తీసుకెళుతున్నారు. తనకు అంగబలం ఉన్నట్లు చూపించుకునేందుకే అభ్యర్థులు వారిని అలా తీసుకు వెళుతున్నారు. ఏదైతేనేం అలా రెండు గంటలు వెళితే రూ.200 వస్తాయి కదా..? అని ఇంట్లో భార్య, భర్త, పిల్లలు సైతం ప్రచారానికి వెళ్లడం, ఆ పూటకు ఆ నేతకు జై కొట్టడం, రూ. 200 తెచ్చుకోవడం తాత్కాలికంగా ఉపాధి మార్గంగా ఉంది. గ్రామాల్లో రబీ సీజన్ పూర్తి కావడంతో వ్యవసాయ పనులు లేక, ఎండలో ఉపాధి పనులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న వారికి ఇదో అవకాశం. దీంతో ఈరోజు ఎవరు పిలుస్తారా ? అని ఎదురుచూస్తున్నారు.

- సీతారామపురం

ఓ సారి వచ్చిపో మామా...!

అదే మందు




ఏం మామా బాగున్నావా.. మీరంతా ఓటేయడానికి రావాలా. వచ్చిపోయే చార్జీలు, ఖర్చులు ఇస్తా. నీతోపాటు అక్కను కూడా తీసుకురా. అలాగే మనవాళ్లందరితో కూడా మాట్లాడతా. నువ్వు కూడా ఓసారి చెప్పు. అందరూ ఒకేసారి వస్తామంటే రిజర్వేషన్ చేస్తా. లేదంటే ఇక్కడ నుంచి బండి పంపుతా. ఎన్నికల రోజున విందు, మందు కూడా సిద్ధం చేస్తా. సరేనా.. మామా..! ఇదీ ప్రస్తుతం వలస ఓటర్లను రప్పించేందుకు అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నాలు.. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో వలస ఓటర్లు అధికం. అభ్యర్థుల గెలుపోటములో వీరే కీలకం. నియోజకవర్గంలో 2,41,861 ఓటర్లు ఉండగా అందులో సుమారు 40 శాతం మంది వలస ఓటర్లే ఉన్నారు. వారిని ఎన్నికల రోజున పిలిపించేందుకు నాయకులు, అభ్యర్థులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు వలసవాసులతో ఆత్మీయ సమావేశాలు సైతం నిర్వహించారు. ఓటుకు, రవాణా ఖర్చులకు వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. మిగతా ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

- ఉదయగిరి రూరల్/ పలేటివారిపాలెం

'వ్యాట్'తో వాత!

'పెట్రో' మోత..

- పెట్రోలు, డీజిల్ ధరపై పన్నుపోటు
- పొరుగు రాష్ట్రాలతో పోల్చితే 6 శాతం ఎక్కువ
- పైగా రోడ్ల అభివృద్ధికంటూ లీటరుపై ఒక శాతం పన్ను
- కర్ణాటక ధరలతో పోల్చితే నెలకు రూ.45.55 కోట్ల వ్యత్యాసం
- తమిళనాడుతో పోల్చితే రూ.19.70 కోట్ల భారం
- వాహనదారుల నడ్డి విరుస్తున్న జగనన్న ప్రభుత్వం



ప్రాంతం	డీజిల్	పెట్రోలు
కర్ణాటక	86.32	98.07
తమిళనాడు	92.34	106.07
నెల్లూరు	97.86	110.07

'రక్తంతో నడుపుతాను రిక్షాను. నా రక్తమే నా రిక్షకు పెట్రోలు. పెట్రోల్ ధర పెరిగింది. డీజిల్‌ధర పెరిగింది." అంటూ ప్రజా గాయకుడు, దివంగత గద్దర్ ఆలపించిన ఈ సినీ గీతం అప్పట్లో ఓ సంచలనమైంది. ఇప్పుడు బండి తాకిన ప్రతిసారీ ప్రతి ఒక్కరికి ఈ పాట గుర్తుకు వస్తోంది. గద్దర్ ఆలపించిన కాలంలో ప్రయాణానికి ప్రత్యామ్నాయం ఉండేది. పెట్రోలు, డీజిల్‌తో పనిలేకుండా శరీర కష్టంతో నడిచే రిక్షాలైనా ఉండేవి. ఇప్పుడు ప్రజలకు ప్రత్యామ్నాయమే లేదు. అన్నీ ఇంధనంతో నడిచే మోటారు రిక్షాలే. ప్రజల విధిలేని పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం బాగానే క్యాష్ చేసుకొంటోంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా పన్ను రూపంలో ప్రజల నెత్తురు తాగేస్తోంది. మన రాష్ట్రంలో పెట్రో ధరలకు, పక్కనున్న తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల ధరలకు నేలకు ఆకాశానికి ఉన్నంత తేడా కనిపిస్తోంది. లీటరుపై పది పైసలు పెరిగితేనే తల్లడిల్లిపోయే సామాన్యులు గత ఐదేళ్లుగా లీటరుపై 5 నుంచి 11 రూపాయల ధర పెరిగినా, దానికి కారణమైన ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం లేక మౌనంగా రోదిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల ధరలతో పోల్చితే మన జిల్లా ప్రజలు నెలకు రూ.20 కోట్ల నుంచి 45 కోట్ల అదనపు భారం మోస్తున్నారు.

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి): మన పొరుగు రాష్ట్రమైన కర్నాటకలో పెట్రోలు ధర లీటరు రూ.98.07. మన జిల్లాలో 110.07 పైసలు. అంటే 12 రూపాయలు అదనం. జిల్లాలో రోజుకు 4లక్షల లీటర్ల పెట్రోల్ వినియోగిస్తున్నారు. కర్నాటక ధరతో పోల్చితే ఒక రోజుకు రూ.48 లక్షలు (దాదాపుగా అర కోటి) జిల్లావాసులు అదనంగా చెల్లిస్తున్నారు. ఈ లెక్కన నెలకు 14.40 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేస్తోంది. ఇక డీజిల్ విషయానికి వస్తే కర్నాటకలో లీటరు రూ.86.32. మన జిల్లాలో రూ. 97.86. అంటే లీటరుపై రూ.11.54 అదనం. జిల్లాలో ఒకరోజుకు 9 లక్షల లీటర్ల డీజిల్ వినియోగం జరుగుతోంది. ఈ లెక్కన రోజుకు సుమారు రూ.1.03 కోట్లు. నెలకు రూ.31.15 కోట్లు అదనంగా చెల్లిస్తున్నాము. కర్నాటకతో పోల్చితే జిల్లా వినియోగదారులు పెట్రోలు, డీజిల్ రెండింటి ద్వారా నెలకు 45.55 కోట్ల రూపాయలు అదనంగా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు.

● తమిళనాడుతో పోల్చితే..

తమిళనాడులో పెట్రోలు లీటరు రూ.106.07. మన జిల్లాలో రూ.110.07. వ్యత్యాసం లీటరుకు 4రూపాయలు. మన వినియోగం రోజుకు 4 లక్షల లీటర్లు. ఈ లెక్కన ఒక రోజుకు మనం అదనంగా చెల్లించే మొత్తం రూ. 16 లక్షలు. నెలకు రూ.4.80 కోట్లు. ఇక తమిళనాడులో డీజిల్ ధర లీటరు రూ.92.34. మన జిల్లాలో రూ.97.86. వ్యత్యాసం రూ.5.52. రోజుకు మన వినియోగం 9లక్షల లీటర్లు. అంటే రోజుకు జిల్లావాహనదారులు చెల్లించే అదనపు ధర రూ.49.68 లక్షలు. నెలకు రూ.14.90 కోట్లు. పెట్రోలు, డీజిల్ రెండింటిపై తమిళనాడు రేట్లతో పోల్చితే మనం అదనంగా చెల్లించే మొత్తం నెలకు రూ.19.70 కోట్లు.

● పన్ను పోటే అసలు కారణం

పొరుగు రాష్ట్రాలకు, మన రాష్ట్రంలో పెట్రో ధరకు ఇంత భారీగా వ్యత్యాసం ఉండటానికి కారణం కేవలం రాష్ట్ర ప్రభుత్వ మే. పక్క రాష్ట్రాల కన్నా ఎక్కువ శాతం పన్ను వేయ డంతో ఇక్కడ ధరలు ఇంత భారీగా పెరిగాయి. కర్నాటకలో 25.92 శాతం వ్యాట్ (పన్ను) వసూలు చేస్తున్నారు. తమిళనాడులో 13శాతం వ్యాట్‌తో పాటు ఒక లీటరుకు రూ11.52 అదనంగా వసూళ్లు చేస్తున్నారు. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా భారీగా పన్ను వసూళ్లు చేస్తోంది. 31 శాతం వ్యాట్‌తోపాటు ప్రతి లీట రుపై అదనంగా 5 రూపాయలు వసూళ్లు చేస్తోంది. ఈ ఐదు రూపాయల్లో ఒక రూపాయి రోడ్ల అభివృద్ధి కోసం అన్నట్లు చూపిస్తోంది. ఇంత భారీ స్థాయిలో వ్యాట్ పెంచిన కారణంగానే పొరుగు రాష్ట్రాలతో పోల్చితే మన దగ్గరే భారీ వ్యత్యాసం వస్తోంది.

నా సంపాదనలో సగం పెట్రోల్‌కే!



15 సంవత్సరాలుగా నేను ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్నా. గతే డాది ఏప్రిల్‌లో ముడి చమురు ధరలు జీవితకాల కనిష్టానికి చేరినా మన దేశంలో మాత్రం తగ్గలేదు. పైగా పెరుగుతూ వస్తున్నాయి. నా సంపాదన సగం పెట్రోల్ ఖర్చులకే సరిపోతోంది. ఎన్నికల హడావిడి ప్రారంభమవడంతో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధర కాస్త తగ్గించినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను తగ్గించక పోవడంతో ముడి సరుకు, కూరగాయల రవాణా చార్జీలు పెరిగిపోయాయి. మా లాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి.

- పాలిశెట్టి శ్రీనివాసులు, సీతారామపురం


టాక్సుల భారమే ఎక్కువ



ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు ఉన్నాయి. వ్యాట్ పేరుతో అధికంగా వసూలు చేస్తున్నారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వ్యాట్ తక్కువగా ఉండి మనకంటే 12 రూపాయలకు తక్కువగా ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ తగ్గించి పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి.

- రావిళ్ల శ్రీనివాస్ నాయుడు, నెల్లూరు

పెట్టుబడులు పెరిగిపోయాయి!



పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగి పెట్టుబడులు అధికమవుతున్నాయి. దిగుబడులు రవాణా చేయాలన్న, వ్యవసాయ ఉత్పత్తులు తెప్పించుకోవాలన్న అవస్థలు తప్పడం లేదు.

- రమణయ్య, అనంతసాగరం

అన్ని విధాలుగా లాగేశారు!

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే లీటరుకు పది రూపాయలకుపైగా మనరాష్ట్రంలో వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. కనీసం ఎన్నికల సమయంలోనైనా ఈ భారం తగ్గిస్తారని ఆశించాం. అయితే అందుకు విరుద్ధంగా ధరలు పెంచడం దుర్మార్గం. బటను నొక్కుడు అంటూ ఊరిస్తూ ఎన్నివిధాలుగా జేబుకు చిల్లుపెట్టి లాక్కోవాలో అన్నివిధాలుగా లాక్కుంటున్న దయనీయ పరిస్థితి రాష్ట్రంలో ఉంది.

- మంగపాటి శ్రీను, వరపర్లవారిపాలెం, కందుకూరు


టెక్నాలజీతో వలస ఓటర్లకు వల

వలస ఓటర్లకు ఎరవేయటంలో అభ్యర్థులు టెక్నాలజీని ఎంతో బాగా వినియోగించుకుంటున్నారు. వలస ఓటర్లు అధికంగా ఉండే కందుకూరులో ఎన్నికల రోజున వారిని గ్రామాలకు రప్పించుకుని మిస్‌కాకుండా ఓట్లు వేయించుకునేందుకు వారు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గంలో 60వేలకుపైగా వలస ఓటర్లు ఉన్నట్లు అంచనా. గతంలో వలస ఓటర్లు అంటే బేల్దారి పని, ఇతరత్రా శ్రమజీవులు మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం వీరితోపాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, బిల్డర్లు, వివిధ వ్యాపారాల కోసం నగరాల్లో స్థిరపడినవారు ఉన్నారు. కందుకూరు ప్రాంతానికి చెందిన వారు బెంగళూరు, హైదరా బాద్, చెన్నైలలో ఎక్కువగా స్థిరపడి ఉన్నారు. ఇక దేశంలోని అనేక నగరాలలో కూడా ఈప్రాంత వాసులు స్థిరపడ్డారు. గతంలో వారందరినీ సమీకరించుకుని ఓ బస్సో, ప్రత్యేక వాహనమో ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవటంతో నేతలు టెక్నాలజీని వాడుతున్నారు. వారి ఫోన్‌నెంబర్లు తీసుకోవటం, వారితో నేరుగా మాట్లాడడం చేస్తున్నారు. ఓటేసేందుకు సుముఖత వ్యక్తంచేసేవారికి రానుపోను ఛార్జీలు కూడా ఫోన్‌పే, గూగుల్‌పే, అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఇందుకోసం పార్టీ కార్యాలయాల్లో టెక్నాలజీ తెలిసిన యువతను ప్రత్యేకంగా నియమించుకున్నారు. ఎన్నికల రోజు బస్సులు, ఇతర వాహనాలు దొరికే పరిస్థితి ఉండదని, ముందస్తు ప్రణాళిక లేకుంటే రైళ్లు, బస్సుల్లో కూడా టికెట్లు దొరికే పరిస్థితి ఉండదని గుర్తించి ముందస్తుగానే డబ్బు పంపుతున్నారు. మీ ఏర్పాట్లు మీరు చేసుకోవాలని వలసఓటర్లకు సూచిస్తున్నారు.

● తెలంగాణపై ప్రత్యేక దృష్టి

తెలంగాణలో స్థిరపడిన వలస ఓటర్లపై ఇరుపార్టీల నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. మే 13న రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ, ఇక్కడ ఓటు ఉన్నవారు ఇక్కడ ఓటుకు రాకపోవచ్చన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ కేవలం పార్లమెంటు ఎన్నికలే అయినా ఓటుకు నోటు వ్యవహారం దండిగానే జరుగుతున్నందున ఇంత ప్రయాస పడి ఇక్కడికి వచ్చి ఓటు వేసేందుకు ఆసక్తి చూపరేమోనని అనుమానిస్తున్న నేతలు వారితో ప్రత్యేకంగా మాట్లాడుతు న్నారు. ఆంధ్రాలో అసెంబ్లీ ఎన్నికలు అయినందున మీరు తప్పకుండా రావాలని అభ్యర్థిస్తున్నారు. అలాంటివారికి అదనంగా కొంతమొత్తం చెల్లించేందుకైనా సిద్ధపడుతున్నారు.

- కందుకూరు



ఉద్యమాల పురిటిగడ్డ కావలి

ముఖచిత్రం



కావలి, మే 4 : చరిత్రలో కావలి నియోజకవర్గానికి ఓ విశిష్టస్థానం ఉంది. పట్టణంలో జవహర్ భారతి (జేబీ) కళాశాల ఏర్పాటుతో విద్యా కేంద్రంగా పేరొందింది. జేబీలో విద్యను అభ్యసించిన వారిలో అనేకమంది మేధావులు ఉన్నారు. ఇక్కడ చదివిన వారు అనేక ప్రాంతాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నారు. ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు పార్టీ లాంటి వామపక్షభావాలు ఉన్నవారు కూడా కావలిలో ఎక్కువే. ఇక్కడ చైతన్యవంతులు ఎక్కువగా ఉండటంతో ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరొందింది. ఎలాంటి ఉద్యమాలైనా తొలుత కావలిలోనే ప్రారంభమవుతాయి. సారా ఉద్యమం కూడా తొలుత కావలి నియోజకవర్గ పరిధి దూబగుంటలోనే పుట్టింది. సారా ఉద్యమం ద్వారా దూబగుంట రోశమ్మ రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ ఉద్య మంతో దేశవ్యాప్తంగా కావలికి గుర్తింపు వచ్చింది. అలాగే వస్త్రవ్యాపారంలో రెండో ముంబాయిగా కావలి గుర్తింపు పొందింది. తద్వారా ఎంతోమందికి ఉపాధి కలిగింది. ఇన్ని ప్రత్యేక తలు ఉన్న కావలి రాజకీయాల్లోనూ తనకంటూ ప్రత్యేకతను కలిగిఉంది.

ఇప్పటి వరకు కావలిలో గెలిచిన వారు

సంవత్సరం	గెలిచిన వారు	పార్టీ
1952	బత్తిన రామకృష్ణారెడ్డి	ప్రజాపార్టీ
1955	బత్తిన రామకృష్ణారెడ్డి	ప్రజాపార్టీ
1962	ఎల్లంపల్లి పెంచలయ్య	కాంగ్రెస్
1967	గొట్టిపాటి సుబ్బులునాయుడు	స్వతంత్ర
1972	గొట్టిపాటి కొండపనాయుడు	స్వతంత్ర
1978	కలికి యానాదిరెడ్డి	కాంగ్రెస్
1983	పాతాళపల్లి వెంగళరావు	టీడీపీ
1985	కలికి యానాదిరెడ్డి	కాంగ్రెస్
1989	కలికి యానాదిరెడ్డి	కాంగ్రెస్
1994	కలికి యానాదిరెడ్డి	కాంగ్రెస్
1999	వంటేరు వేణుగోపాల్ రెడ్డి	టీడీపీ
2004	మాగుంట పార్వతమ్మ	కాంగ్రెస్
2009	బీద మస్తాన్‌రావు	టీడీపీ
2014	రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడి	వైసీపీ
2019	రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి	వైసీపీ

● ఎక్కువసార్లు కాంగ్రెస్‌దే విజయం

కావలి నియోజకవర్గం 1952లో ఏర్పడగా, ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 6 పర్యాయాలు కాంగ్రెస్, 3 పర్యాయాలు టీడీపీ, 2 పర్యాయాలు ప్రజాపార్టీ, 2 సార్లు వైసీపీ, 2 సార్లు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కలికి యానాదిరెడ్డి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మంత్రివర్గంలో సహకార శాఖ, దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పటివరకు 10 మంది ఎమ్మెల్యేగా పనిచేయగా, వారిలో కలికి యానాదిరెడ్డికి మాత్రమే మంత్రి పదవి లభించింది. 2009లో నియోజకవర్గ పునర్విభజన జరిగింది.



2009 వరకు కావలి పట్టణం, కావలి రూరల్, జలదంకి, కలిగిరి, కొండాపురం, దగదర్తిలో కొంతభాగం కావలి నియోజకవర్గ పరిధిలో ఉండేవి. 2009లో పునర్విభజన అనంతరం కావలి పట్టణం, కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలు కావలి నియోజకవర్గ పరిధిలో చేరాయి.

కోవూరు సర్వేపల్లి

శిథిలావస్థలో పైడేరు బ్రిడ్జి

- వాహనాల రాకపోకలకు అంతరాయం
- అవస్థలు పడుతున్న రైతాంగం


కూలేందుకు సిద్ధంగావున్న కనిగిరి రిజర్వాయర్ పైడేరు ఎస్కేప్ చానల్ బ్రిడ్జి

బుచ్చిరెడ్డిపాళెం, మే 4: సుమారు 150 ఏళ్ళ క్రితం బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో కనిగిరి రిజర్వాయర్‌లో భాగంగా మునులపూడి పంచాయతీ కొండాయగుంట వద్ద నిర్మించిన పైడేరు ఛానల్ శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా వుంది. దీంతో గత రెండేళ్లుగా ఆ బ్రిడ్జి మీద ఆటోలు, ద్విచక్ర వాహనాలు తప్ప ఇతర భారీ వాహనాల రాకపోకలు అదుపు చేస్తూ సంబంధిత అధికారులు గడ్డర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే బ్రిడ్జి పగుళ్ళిచ్చింది. ఛానల్‌కున్న షట్టర్లు, ప్లాట్‌ఫారం దెబ్బతిన్నాయి. బ్రిడ్జి నిర్మాణం లోపు దెబ్బతిన్న షట్టర్లకు మరమ్మతులు చేపట్టకుంటే వర్షాకాలంలో రిజర్వాయర్‌లో సాగుజలాలు వృథా అయ్యే ప్రమాదం వుందని రైతులు పేర్కొంటున్నారు. ఈవిషయం ఇటీవల రెడ్డిపాళెంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి స్థానిక రైతులు మరోసారి గుర్తు చేసినా ప్రయోజనం లేదని, ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి పైడేరు బ్రిడ్జికి మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బ్రిడ్జి కూలితే రిజర్వాయర్ జలాలు పైడేరుకే..

పైడేరు ఎస్కేప్ చానల్‌పైన వున్న బ్రిడ్జిగాని కూలితే కనిగిరి రిజర్వాయర్‌లో సాగు జలాలన్నీ పేడేరు పాలవుతాయని, దీని ప్రభావం కనిగిరి ఆయకట్టు రైతాంగం మొత్తాన్ని ఎండగడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బ్రిడ్జి కూలేలోపు ప్రభుత్వం గానీ, సంబంధిత అధికారులు గానీ అప్రమత్తం కాకుంటే బ్రిడ్జికి ఇరువైపులా వున్న బుచ్చి, దగదర్తి, సంగం మండలాలకు సంబంధించిన వ్యవసాయ భూములకు చెందిన రైతులు తీవ్ర కష్టాలు ఎదుర్కోక తప్పదంటున్నారు. బ్రిడ్జి కూలిందంటే బ్రిడ్జికి ఇరువైపులా వున్న రైతుల వరికోత పరికరాలు, ట్రాక్టర్లు కాదుకదా ఆఖరికి ఎడ్ల బండ్లు కూడా పోలేని పరిస్థితి ఎదురవుతుందని, వరినాట్లు, వరికోతల సమయంలో పొలాల్లోకి వెళ్ళాలంటే సుమారు 6కిలోమీటర్లు దూరం చుట్టుకుని వెళ్ళాల్సి వుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి పూనుకోకుంటే నానా అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

టెండర్లు పిలిచినా ముందుకు రాలేదు : ఇరిగేషన్ ఏఈ

రెండేళ్ళ క్రితం మొదట ఎఫ్‌డీఆర్ ద్వారా రెండుసార్లు టెండర్లు పిలిచినా ఎవ్వరూ ముందుకు రాలేదు. మళ్ళీ కలెక్టర్ ద్వారా ప్రత్యేక అనుమతితో సుమారు రూ.1.50కోట్లతో టెండర్లు పిలిచినా ఒక్క టెండరుదారు కూడా ముందుకు రాలేదు. త్వరలో మళ్ళీ టెండర్లు పిలుస్తారు. అయినా ముందు జాగ్రత్త చర్యగా మరమ్మతులు కూడా చేపడతాము.

టీడీపీ కూటమితోనే జనరంజక పాలన : సోమిరెడ్డి


పొదలకూరు : విరువూరులో మాట్లాడుతున్న సోమిరెడ్డి


మనుబోలు : మాజీ ఎంపీపీ రామిరెడ్డికి కండువా కప్పి స్వాగతిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

పొదలకూరు, మే 4: టీడీపీ కూటమితోనే జనరంజక పాలన సాధ్యమని, సర్వేపల్లి ప్రజలు మే 13న జరిగే ఎన్నికల్లో రెండో నెంబరు బటన్ నొక్కాలని మాజీ మంత్రి, టీడీపీ సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆనాటి కంద్రిక వరదాపురం, పోలవర పల్లి, విలుఫూరు, నల్లపాలెం, స్వరాయపాలెం, తాటిపర్తి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని నేదురుమల్లిలో వైసీపీని వీడి 18 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే ప్రభగిరి పట్టణానికి చెందిన 16 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని పార్టీలోకి చంద్రమోహన్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలన్నింటిని గెలవగానే పరిష్కరి స్తామన్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, కమలం గుర్తుకు ఓటువేసి ఎంపిగా వెలగపల్లి వర ప్రసాద్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, యద్దల అజయ్, హనుమారెడ్డి, పల్లారపు కృష్ణ, కండే మస్తానయ్య, పార్లపల్లి సురేష్‌రెడ్డి, జమీర్, ఖాదర్‌బాషా, పాల్గొన్నారు.

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక

మనుబోలు: మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచు చేరెడ్డి పట్టాభిరామిరెడ్డితో పాటు వందకుపైగా కుటుంబాలు వైసీపీని వీడి శనివారం నెల్లూరులో సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మనుబోలు టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ

తోటపల్లిగూడూరు: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మహిళలకు రక్షణ ఉండేదని, వైసీపీ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలం లోని మండపం పంచాయతీలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు తాండ్ర కృష్ణరామయ్య, గోపి, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కోడూరు పంచాయతీ పాతపాలెంలో శనివారం టీడీపీ నాయకులు వీరబోయిన గంగాధర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

23 కుటుంబాలు చేరిక

వెంకటాచలం: వేదాయపాళెంలోని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కార్యాలయంలో శనివారం కాకుటూరు, చెముడుగుంట గ్రామాల నుండి వైసీపీ నాయకులు, 23 కుటుంబాలు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ పాల్గొన్నారు.

● సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి కోరారు. వెంకటాచలం, పూడిపర్తి గ్రామాలలో ఆమె శనివారం తండ్రి సోమిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● **మనుబోలు:** తన మామ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ కోడలు శృతిరెడ్డి మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఆర్యవైశ్యుల ఇంటింటి ప్రచారం

పొదలకూరు : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛను అందిస్తామని ఆర్యవైశ్య మహాసభ రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం చైర్మన్ ఆమర్తలూరి చెంచయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి, తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు ఆకులూరు విజయ్‌కుమార్, పొట్టి సుధాకర్, పిన్నెల్లి ప్రభాకర్, గుర్రం మీరా మధు, పెసల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

● బీజేపీ తిరుపతి పార్లమెంటు అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌ని కమలం గుర్తు మీద ఓటు వేసి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని శనివారం పట్టణంలోని బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోబీజేపీ సీనియర్ నాయకుడు చింతగింజల సుబ్రహ్మణ్యం, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాసపూట ధనుంజయరావు, బీజేవైఎం నాయకుడు పండగ ప్రశాంత్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 63 మంది గైర్హాజరు

వెంకటాచలం, మే 4: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో శనివారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 63 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 113 మంది విద్యార్థులకు గాను 107 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 843 మంది విద్యార్థులకుగాను 786 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

అదానీ కృష్ణపట్నం పోర్టుకు ఎక్సలెన్సీ అవార్డు


అవార్డు అందుకున్న అదానీ పోర్టు ప్రతినిధులు

ముత్తుకూరు, మే 4: అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ (ఏకేపీఎల్) 16వ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సదరన్ రీజియన్ 5ఎస్ ప్రాసెస్ మెచ్యూరిటీ ఎక్సలెన్సీ అవార్డు 2023-24 అందుకుంది. చెన్నైలో శనివారం సీఐఐ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈహెచ్‌ఎస్ ఎంజీఎం వేణుగోపాల్‌రెడ్డితోపాటు మధుసూదన్, నాగార్జున, రేవతి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు మాట్లాడుతూ అవార్డు లభించడం హర్షణీయమన్నారు. అవార్డు రావడం వల్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు.

గ్యాస్ ఈకేవైసీ గడువు పొడిగింపు

ముత్తుకూరు, మే 4 : గ్యాస్ వినియోగదారులకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాల ఈకేవైసీ గడువును పొడిగించినట్లు ముత్తుకూరు ఆదిత్య ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఆదిత్య శనివారం తెలిపారు. వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈకేవైసీ నమోదు తాత్కాలికంగా నిలిపి వేశామన్నారు. మే 16నుంచి 31వ తేదీ వరకు యథాప్రకారం ఈకేవైసీ నమోదు జరుగుతుందని తెలిపారు.


వీపీఆర్ దంపతులను గజమాలతో సన్మానించిన టీడీపీ కార్యకర్తలు

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును గెలిపించాలి : వీపీఆర్

విడవలూరు, మే 4 : వైసీపీ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రం తిరిగి అభివృద్ధి చెందాలంటే, రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు అధికారంలోకి రావాలని నెల్లూరు ఎంపీ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఊటుకూరులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో పర్యటిస్తూ సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక, గ్రావెల్, మద్యం మాఫియాలు పెరిగిపోయాయన్నారు. ఒక్క పరిశ్రమను కూడా రాష్ట్రానికి తీసుకుని రాకుండా వైసీపీ పాలకులు నిరుద్యోగులను నట్టేట ముంచారని ఆయన దుయ్యబట్టారు. విజయసాయిరెడ్డి ఓటమి భయంతో తమపై లేనిపోని నిందలు మోపుతున్నారని పేర్కొన్నారు. ఈనెల 13 తర్వాత విజయసాయిరెడ్డి ఢిల్లీకి పారిపోతాడని వీపీఆర్ ఎద్దేవా చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తనను, కోవూరు నుంచి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో కోవూరు నియోజకవర్గంలో అరాచకాలు పేట్రేగిపోయాయని, చిరువ్యాపారులు వద్ద సైతం వసూళ్లకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలను తీసుకొచ్చే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. కోవూరు నియోజకవర్గంలో అవినీతిరహిత పాలనను అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మండల, జిల్లా నేతలు చెముకుల శ్రీనివాసులు, చెముకుల కృష్ణచైతన్య, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బెజవాడ ప్రదీప్‌కుమార్‌రెడ్డిలతోపాటు బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో మహిళా సంక్షేమం

- కోవూరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


ఇందుకూరుపేట : ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న ప్రశాంతిరెడ్డి


బుచ్చిరెడ్డిపాళెం : బస్టాండ్ సెంటర్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు


విడవలూరు: ప్రశాంతిరెడ్డి విజయాన్ని కోరుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

ఇందుకూరుపేట, మే 4: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళల సంక్షేమానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నిడిముసలి, ముదివర్తిపాలెం, కృష్ణాపురం గ్రామాలలో శనివారం ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా రైతాంగానికి యూనిట్ రూ.1.50పై నాణ్యమైన విద్యుత్ అందిస్తామని, ఏరియేటర్లు సబ్సిడీపై ఇస్తామని, తుఫాను వలన వరదలకు దెబ్బతిన్న పొర్లుకట్టలకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, మరబోట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని, మీ పాలకురాలిగా కాకుండా మీ సేవకురాలిగా పనిచేస్తానని తెలిపారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, సివీ శేషారెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, అవ్వారు ఏడుకొండలు, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, మునగాల రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులతోనే కోవూరు అభివృద్ధి సాధ్యం

బుచ్చిరెడ్డిపాళెం: వేమిరెడ్డి దంపతులతోనే జిల్లాతోపాటు కోవూరు నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని టీడీపీ నాయకులు ఆర్కే రవి, ఇమ్మిడిశెట్టి సుబ్బారావు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి వారు బుచ్చిలోని 11వ వార్డులో కన్యకాపరమేశ్వరి ఆలయం దగ్గర్నుంచి వేమిరెడ్డి దంపతుల తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 20లక్షల ఉద్యోగాలు మెగా డీఎస్సీ, ఎన్నికల మేనిఫెస్టోను వివరించి టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును సీఎంగా చేసుకోవాలని, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో గోవిందయ్య, ఇనుగూరు బాలయ్య, సీహెచ్ ప్రసాద్, వి.సుధీర్, జి. సురేష్, టీడీపీ, బీజేపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

విడవలూరులో ఇంటింటి ప్రచారం

విడవలూరు: టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం వెనుకబడిన తరగతుల వర్గాలకు చెందిన నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని ఎన్నుకుంటే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించుకోవాల్సి ఉందన్నారు. మాజీ ఉపసర్పంచ్ పందిళ్ల సుబ్రహ్మణ్యం, గౌడ్ సంఘం నాయకులు బండ్ల బాబయ్య, దాసరి విజయ్, దాసరి శ్రీనివాసులు, దాసరి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


జమ్మిపాలెం వద్ద పెన్నా ఒడ్డున ఏర్పాటు చేసిన ఇసుక డంప్

డబ్బులిచ్చుకో.. దర్జాగా తవ్వుకో!

- 'పెన్నా'ను కుళ్లబొడుస్తున్న అక్రమార్కులు
- జమ్మిపాలెం, కాగులపాడు, సంగం వద్ద దందా
- సెబ్, పోలీసులను మేనేజ్ చేస్తున్న ఓ కానిస్టేబుల్


పెన్నా పొర్లుకట్టను ధ్వంసం చేసి నదిలోకి ఏర్పాటు చేసిన దారి

నెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : అక్రమ సంపాదనకు అలవాటు పడిన అక్రమార్కులు ఎన్నిసార్లు హెచ్చరించినా తమ పంథా మార్చుకోవడం లేదు. పెన్నాలో ఇసుక తవ్వకాలకు అనుమతుల్లేవని మైనింగ్ శాఖ అధికారులు తవ్వకాలు ఆపేసినా రాత్రివేళల్లో దర్జాగా దందా కొనసాగిస్తున్నారు. ఇసుక రీచ్‌ల ఒడ్డున యార్డుల పేరుతో ఒక రకమైన దోపిడీ జరుగుతుండగా, జమ్మిపాలెం, కాగులపాడు, సంగం ప్రాంతాల్లో మరో రకమైన దోపిడీ జరుగుతోంది. పెన్నా ఒడ్డున ఒక ప్రాంతాన్ని ఎంచుకొని నదిలో నుంచి అక్కడికి ఇసుకను డంప్ చేసుకుంటున్నారు. రాత్రి 8 నుంచి వేకువజామున 4 గంటల వరకు ఈ ప్రాంతాలకు వాహనాలు బారులు తీరుతున్నాయి. నెల్లూరు వెంకటేశ్వరపురం జగనన్న లేఅవుట్‌ను ఆనుకొని జమ్మిపాలెం వద్ద పెన్నా నదిలో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఏకంగా రూ.కోట్లతో నిర్మించిన పెన్నా పొర్లుకట్టను ధ్వంసం చేసి మరీ నదిలోకి దారి ఏర్పాటు చేసుకున్నారు. ఆ ప్రాంతంలో పరిశీలించగా ఇసుక తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు కనిపిస్తున్నాయి. నది ఒడ్డునే భారీ డంప్‌ను ఏర్పాటు చేసి ఉన్నారు. జగనన్న లేఅవుట్ మీదుగానే ఇసుక వాహనాలు వెళుతుండడంతో లేఅవుట్లు రోడ్లు గుల్లయిపోయాయి. కాగులపాడు, సంగం ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. స్థానిక వైసీపీ నాయకులకు మామూళ్లు కడుతూ ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. నదీ తీర ప్రాంతాల్లోని ప్రజలు సొంత అవసరాలకు ట్రక్కు ఇసుక తీసుకెళ్లినా కేసులు పెట్టే సెబ్, పోలీసు, మైనింగ్ అధికారులు ఈ అక్రమ తవ్వకాలపై కన్నెత్తి చూడడం లేదు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా వారూ పట్టించుకోవడం లేదు. అందుకు ప్రధాన కారణం సెబ్, పోలీసులకు మామూళ్లు చేరుతుండడమేనన్న ఆరోపణలు ఉన్నాయి. వెంకటగిరి బెటాలియన్‌లో పనిచేసే ఆ కానిస్టేబుల్ డిప్యుటేషన్ ప్రస్తుతం నెల్లూరులో ఉంటూ ఈ తవ్వకాలకు సూత్రధారిగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కానిస్టేబులే అందరినీ మేనేజ్ చేసుకుంటూ ఇసుక వాహనాలను పట్టుకోకుండా చూస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

కిలో పొగాకు రూ.298

కలిగిరి, మే 4: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 579 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 14 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 528 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-33, ఆర్ఆర్-2, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 51 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.298, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.268.48గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

వైసీపీ పాలనలో దళితులకు ద్రోహం

- సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి

ఆత్మకూరు/వింజమూరు, మే 4 : 'వైసీపీ పాలనలో దళితలకు తీరని ద్రోహం జరిగింది. దళితులపై దాడులు, పోలీసు కేసులు పెచ్చుమీరాయి. ఎస్సీలు నా మేనమామలంటూ మాయమాటలు చెప్పిన జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహిగా మారాడు. దళితులంతా ఏకమై జగన్‌కు గుణపాఠం చెప్పాల్సిన రోజులు దగ్గర పడ్డాయి' అని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు, వింజమూరులలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయాలు చేస్తానని చెప్పి విధ్వంసపూరిత, కక్షపూరిత రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. దళితుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రవేశపెట్టబడిన అంబేడ్కర్ విదేశ విద్యా పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం, అంబేడ్కర్ స్టడీ సర్కిల్, భూమి కొనుగోలు పథకం తదితర 27 పథకాలను నిర్వీర్యం చేశాడని ధ్వజమెత్తాడు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలపైన జరిగిన దాడుల్లో జగన్ ఆల్ టైం రికార్డు సృష్టించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు జువాజీ ఫణీంద్రకుమార్, బండి కిరణ్‌కుమార్, దుంపల హరీష్, నాగేశ్వరరావు, హరీష్, పాల్‌విట్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ


బీరువాను ధ్వంసం చేసిన దొంగలు

మనుబోలు, మే 4: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో రాజనాల బ్రహ్మయ్య, మెడపల్లి వినోద్ ఇళ్ళల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వేసవికాలం కావడంతో బ్రహ్మయ్య, భార్య పిల్లలు ఇంటిపైన నిద్రిస్తుండగా చోరులు ఇంటిలోని బీరువా తలుపులు తీసి అందులో ఉన్న రూ. 10వేలు నగదు, రెండు జతల ఉంగరాలు, సెల్‌ఫోన్ తీసుకెళ్ళారని బ్రహ్మయ్య వాపోయాడు. అలాగే మెడపల్లి వినోద్ ఇంట్లో చోరులు దొంగతనానికి పాల్పడి బీరువాలో ఉన్న జత కమ్మలు, రూ. 24వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లు పట్టుకెళ్ళారని బాధితుడు వాపోయాడు. రెండు చోరీలపై పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ : ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


సంఘటన స్థలంలోనే మృతిచెందిన శివ

ఏఎస్‌పేట, మే 4: మండల కేంద్రం సమీపంలోని బీరాపేరు వాగు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనగా ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగం మండలం పెరమన గ్రామానికి చెందిన తుమ్మల శివ (24) ఏఎస్‌పేట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. అదే సమయంలో హసనాపురం నుంచి ఏఎస్‌పేటకు వస్తున్న ఎస్టీ కాలనీకి చెందిన జేసీపీ ఆపరేటర్ మహేష్ మరో ద్విచక్ర వాహనంలో వేగంగా వస్తూ ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తుమ్మల శివ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్‌కి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి అతన్ని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.

సోమశిలలో 8.087 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 4: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. శనివారానికి జలాశయంలో 8.087 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	147
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	290
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6784
వెండి కిలో ధర	రూ. 82,600
వెండి ఒక గ్రాము	రూ. 84.60

ఎన్నికల పర్వం

చంద్రబాబు, పవన్ పర్యటన విజయవంతం

● వీడ్కోలు పలికిన నాయకులు, అభిమానులు

నెల్లూరు (విద్య/స్టోన్‌హౌస్‌పేట), మే 4 : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కల్యాణ్ నెల్లూరు పర్యటన విజయవంతమైంది. శనివారం నారాయణ మెడికల్ కళాశాల మైదానంలో హెలీప్యాడ్ వద్ద అధినేతలిద్దరికీ మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నాయకులు, అభిమానులు వీడ్కోలు పలికారు. నేతలతో ఫొటోలు, సెల్ఫీల కు కార్యకర్తలు పోటీపడ్డారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడంతో భద్రతా సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం రాత్రి నగరంలో జరిగిన రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్ అనంతరం మినర్వ హోటల్‌లో బస చేశారు. జనసేనానిని కలిసేందుకు నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హోటల్ వద్దకు తరలివచ్చారు. అయితే 104 డిగ్రీల జ్వరంతో పవన్ బాధపడుతు న్నారని, ఎవరినీ కలవలేరని సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు గది నుంచి బయటకు వచ్చిన పవన్‌కల్యాణ్ సమక్షంలో వైసీపీ నాయకుడు, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ జనసేనలో చేరారు. అనంతరం పవన్ నారాయణ మెడికల్ కళాశాలకు చేరుకుని ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో గుడివాడకు బయలుదేరి వెళ్లారు.



హెలిక్యాప్టర్ నుంచి అభివాదం చేస్తున్న చంద్రబాబు, అభిమానుల మధ్య పవన్ కల్యాణ్

అభ్యర్థులకు ఓటరు జాబితాలు

నెల్లూరు(సిటీ), మే 4 : ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఏప్రిల్ 25 నాటికి దరఖాస్తు చేస్తున్న వారందరికీ హక్కు కల్పిస్తూ తుది ఓటరు జాబితాను రాజకీయ పార్టీలకు అందచేసి నట్లు సిటీ ఆర్వో వికాస్ మర్మత్ తెలిపారు. శనివారం కార్పొ రేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులకు ఓటరు జాబితాలను అందజేశారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ల నుంచిగానీ, రుసుము చెల్లించి తమ కార్యాలయం నుంచి గానీ ఓటరు జాబితా తీసుకోవాలని తెలిపారు. డీకే మహిళా కళాశాలలో జరుగుతున్న ఎన్నికల అధికారుల శిక్షణలో పాల్గొన్నారు. పోలింగ్ గడువు దగ్గరకు వస్తున్నందున అందరు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు.



ఓటరు జాబితాను అందిస్తున్న ఆర్వో వికాస్ మర్మత్

జగన్ సభ అట్టర్ ప్లాప్ : కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 4 : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరులో చేపట్టిన ప్రచార సభ అట్లర్ ప్లాప్ అయిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్ గాంధీబొమ్మ వద్దకు చేరుకోగానే జనాలు పెద్దఎత్తున వెనక్కు వెళ్లిపోయారని, వైసీపీ పతనానికి ఇదే నిదర్శనమని చెప్పారు. శుక్రవారం జరిగిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సభకు జనాలు తండోప తండోలుగా వచ్చారని వెల్లడించారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, బాబు, ఆవుల శ్రీనివాసులు, దయాకర్, శేఖర్, కిరణ్‌కుమార్, ప్రభాకర్ నాయుడు, చికోలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సుమంత్ బీజేపీలో చేరిక

నెల్లూరు(హరనాథపురం), మే 3 : జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) మాజీ చైర్మన్ ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డి శనివారం భారతీయ జనతాపార్టీలో చేరారు. చిత్తూరు జిల్లా కలికిరిలో బీజేపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శివప్రకాష్, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుమంత్‌రెడ్డి మాట్లాడుతూ మోదీని మరోసారి ప్రధాన మంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజన్ పాలన అవసరమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు.



కిరణ్‌కుమార్‌రెడ్డి, శివప్రకాష్ సమక్షంలో బీజేపీలో చేరిన సుమంత్‌రెడ్డి తదితరులు

జగన్‌కు అధికారం... రాష్ట్రానికి అంధకారం

నెల్లూరు (సాంస్కృతికం), మే 4 : జగన్మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో మరో చాన్స్ అంటూ అధికారం ఇస్తే రాష్ట్రానికి అంధకారం కొనితెచ్చుకోవడమేనని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు తెలిపారు. శనివారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజలు జగన్‌పై ఎంతో విశ్వాసంతో గత ఎన్నికల్లో గెలిపిస్తే, అతను విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డాడని విమర్శించారు. సంక్షేమానికి సంబంధించిన 15 హామీలను అమలు చేయకపోగా బియ్యం, మైనింగ్, భూ కబ్జాలు, ఇసుక మాఫియాలను పెంచి పోషించారని ఆరోపించారు. జగన్ హయాంలో 1076 మందికి పదవులు ఇవ్వగా అందులో 838 పదవులు ఆయన సామాజిక వర్గమైన రెడ్లకే ఇచ్చారన్నారు. ఐదేళ్లుగా ఆయన సాగించిన అరాచక పాలనకు ప్రజలు ఓటు హక్కుతో చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు.

బీజేపీని ఓడించండి... భారత్‌ను రక్షించండి

దేశంలో మత విద్వేషాలు, మనువాద కార్పొరేట్ ఫాసిజాన్ని ఏర్పాటు చేయబోతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని భారత్ బచావో కార్యక్రమ జాతీయ వైస్‌చైర్మన్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, రాష్ట్ర చైర్మన్ చిగురుపాటి భాస్కరరావు, గూడూరు సీతామహాలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చెంబునీళ్లు, గుప్పెడు మట్టి తప్ప ఏమీ ఇవ్వలేదన్నారు. ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మద్యం అమ్మకాలపై నిరంతర నిఘా

● డిప్యూటీ కమిషనర్ బాబ్జీ రావు

నెల్లూరు(క్రైం), మే 4: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మద్యం అమ్మకాలు, సరఫరాపై నిరంతర నిఘా ఉంటుందని, మద్యం దుకాణాల సిబ్బంది, బార్ల యాజమాన్యం పెద్ద మొత్తంలో మద్యం అమ్మకాలు జరిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని గుంటూరు జోన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎస్ బాబ్జీ రావు హెచ్చరించారు. జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బార్లలోని మద్యం నాణ్యతను పరీక్షించారు. మద్యం అమ్మకాల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ విజిలెన్స్ ప్రకాశం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వీ రేణుక, జిల్లా అధికారి నాగ మల్లేశ్వరరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రేఖ, ఎం వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



బార్లలో తనిఖీ చేస్తున్న బాబ్జీరావు

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

ఎక్కడపడితే అక్కడ నిలిపివేత

నగరంలో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు

రోడ్లపైనే పార్కింగ్



నెల్లూరు సిటీలోకి కారులో వెళ్లలేము... వెళితే కారు పార్కు చేసుకునేందుకు స్థలముండదు. స్కూటర్‌పై వెళితే ఎక్కడో పెట్టి మరెక్కడ పనులు చూసుకోవాలి....! నడిచి వెళ్దామా అంటే రోడ్లన్నీ ట్రాఫిక్‌జామ్‌తో సమస్య....! ఆటోలో వెళ్దామా అనుకుంటే అనుకున్న సమయానికి చేరుకోలేము....! మరెలా....? నిత్యం నెల్లూరీయులు ఎదుర్కొంటున్న సమస్య ఇదీ. విచ్చలవిడిగా వాహనాలు, ఎక్కడపడితే అక్కడే పార్కింగ్....! దీంతో నిత్యం నగరంలోని ప్రయాణికులు, వినియోగదారులు నరకయాతనపడుతున్నారు.

నెల్లూరు నగరంలో వాహనక రాకపోకలు రోజురోజుకు నరకంగా మారుతున్నాయి. అడుగడుగునా ట్రాఫిక్ జామ్‌తో సమస్యలు ఎదురవుతున్నా పోలీసులు పికిలీ ఊది సరిపెట్టే స్తున్నారు. మరి ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడు...? ఎక్కడ...? ఎలా...? అన్నది నగరవాసులను వెంటాడుతున్న ప్రశ్న.

నానాటికి పెరుగుతున్న వాహనాల రద్దీని తగ్గించి ప్రయాణికులకు పార్కింగ్ సమస్య రాకుండా చేయాలన్న ఉద్దేశంతో కార్పొరేషన్ అధికారులు కొన్నేళ్ల క్రితం పెయిడ్ పార్కింగ్ విధానాన్ని తెరపైకి తీసుకువచ్చారు. నగరంలోని పొగతోట, గాంధీబొమ్మ కూడలి, స్టోన్‌హౌస్‌పేట, నర్తకి సెంటర్, మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ కూడలి, వీఆర్సీ సెంటరును ప్రయోగాత్మకంగా తీసుకుని కొన్నిచోట్ల స్కూటర్, మరి కొన్ని చోట్ల కారు పార్కింగ్ చేసుకునేందుకు వీలు కల్పిస్తూ స్థల సేకరణ చేశారు. ఈ ప్రక్రియ దాదాపుగా టెండర్ల దశకు చేరింది. పార్కింగ్ ప్రాంతాలను లీజుకు కేటాయించి ప్రైవేట్ సంస్థలకు అందచేయాలని నిర్ణయించారు. కొన్ని రోజులపాటు తెగ హడావుడి చేసిన కార్పొరేషన్, పోలీసు అధికారులు ఆపై క్రమేణ ఈ విధానాన్ని పక్కనపెట్టేశారు. దీంతో రోడ్లపై పార్కింగ్ పెరిగి పోయి సామాన్యులకు చిరాకు తెప్పిస్తున్నాయి.

రోజు నరకయాతన

నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, రేబాల వారివీధి, ట్రంకురోడ్డు, చిన్న,పెద్దబజార్లు, పొగతోట, ఆర్టీసీ, ఆచారివీధి, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాల వద్ద కార్లు, స్కూటర్లు పార్కింగ్ చేసుకునేందుకు వీలులేని పరిస్థితి. ఇరుకు రోడ్లకుతోడు దుకాణాలు ఎక్కువగా ఉండే వాణిజ్య ప్రాంతాలు కావడంతో ఉదయం 8 గంటలు దాటాక రాత్రి 9 గంటల వరకు ఈ ప్రాంతాల్లో వాహనాలేకాదు నడిచిపోయేందుకూ వీలుండటం లేదు. జన, వాహన రద్దీ వల్ల పనుల నిమిత్తం ఆయా వీధులకు వచ్చిన వారు వాహనాలు ఎక్కడ నిలపాలో తెలియని అయోమయం. రోడ్డు మార్జిన్ వ్యాపారులు, తోపుడుబండ్ల చిరువ్యాపారులు ప్రధాన రోడ్లను ఆక్రమించుకోవ డంతో వాహనాలను పార్కు చేయలేక దూరానపెట్టి నడిచి వెళ్లి పనులు చేసుకోవాల్సి వస్తుంది. ట్రంకురోడ్డు, చిన్న,పెద్ద బజార్లలో వారాంతపు పార్కింగ్ విధానాలను పాటిస్తున్నప్పటికీ ట్రాఫిక్ సమస్య తీరడంలేదు. పెయిడ్ పార్కింగ్ విధానాన్ని పటిష్టంగా అమచేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని నగర వాసులు అభిప్రాయపడుతున్నారు.

- నెల్లూరు(సిటీ)

ప్రజాసంక్షేమమే టీడీపీ ధ్యేయం

● నగర ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణ

● పలు వర్గాలు పార్టీలో చేరిక

నెల్లూరు (విద్య), మే 4 : నెల్లూరు అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. టీడీపీపై ఉన్న నమ్మకంతో రాష్ట్రం బాగుపడాలన్న ఆశయంతో పెద్ద ఎత్తున అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతుండడం శుభపరిణామమన్నారు. నగరంలోని గోమతినగర్ నారాయణ క్యాంపు కార్యాలయంలో శనివారం పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు నారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి నారాయణ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రాన్ని గడిచిన ఐదేళ్లలో జగన్ నిర్వీర్యం చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. పంచాయతీరాజ్ వ్యవస్థను అస్తవ్యస్తం చేయడంతోపాటు చెత్తపన్ను వేసి ఆయా ప్రాంతాలను మురికి కూపాలుగా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ చెత్త ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారంతా రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేతలు రూప్‌కుమార్‌యాదవ్, తాళ్లపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 51వ డివిజన్‌లో పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, నగరానికి చెందిన సూరిశెట్టి నరేంద్ర సోదరులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా ప్రకటించి నారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఇరగాళమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ సూరిశెట్టి దంపతులను, రాయాజీవీధి ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ ఉమా దంపతులను నారాయణ పార్టీలోకి ఆహ్వానించారు.

నాగార్జున అభిమానుల మద్దతు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణకు సినీ నటుడు అక్కినేని నాగార్జున అభిమానులు మద్దతు తెలిపారు. నగరంలోని గోమతి నగర్ నారాయణ క్యాంపు కార్యాల యంలో శనివారం నాగార్జున అభిమాన సంఘం నేతలు నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అభిమాన సంఘం అధ్యక్షుడు మధు, నాయకులు పాల్గొన్నారు.



టీడీపీకి మద్దతు తెలుపుతూ నారాయణ, కోటంరెడ్డిలను సత్కరిస్తున్న అక్కినేని నాగార్జున అభిమానులు, నాయకులు

టీడీపీలోకి చింతంరెడ్డి శిరీష

నగరానికి చెందిన చితంరెడ్డి శిరీష శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెను నగరంలోని 45వ డివిజన్‌కు పార్టీ ఇన్‌చార్జిగా నియమించారు.

లఘుచిత్రం ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం), మే 4 : ప్రముఖ సైకాలజిస్ట్ అభిషేక్ సింగంశెట్టి రూపొందించిన ప్రచార లఘు చిత్రాన్ని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారా యణ ఆవిష్కరించారు. శుక్రవారం నారాయణ మెడికల్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమం లో నారాయణ మాట్లాడారు. ఓటర్లను చైతన్యం చేయటానికి ఈ చిత్రం తోడ్పడుతుందని చెప్పారు. దీన్ని రూపొందించిన అభిషేక్ అభినందించారు. టీవీ నటుడు సింగంశెట్టి మురళీ మోహన్‌రావు మాట్లాడుతూ షాక్.. షాక్ అనే పొలిటికల్ కామిడీ సెటైరికల్ వీడియోను నారాయణ ఆవిష్కరించటం సంతోషంగా ఉందన్నారు. ఈ వీడియోను టీవీ చానళ్లు, సోషల్ మీడియాలో ప్రసారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలయ్యసైన్యం జిల్లా కన్వీనర్ ఎద్దల రవి, కేసీ కృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మహిళకు మేనిఫెస్టోను వివరిస్తున్న పొంగూరు రమాదేవి

శరణి పుట్టినరోజు వేడుకలు

నారాయణ కుమార్తె పొంగూరు శరణి జన్మదిన వేడుకలను నగరంలోని నారాయణ నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కుమార్తెకు నారాయణ కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ కుటుంబ సభ్యులు, విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త వేస్తే జరిమానా

● ఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణయ్య

నెల్లూరు(సిటీ), మే 4 : మురుగు కాలువల్లో చెత్త వేస్తున్న వారిని తమ సిబ్బంది గమనిస్తున్నారని ఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణయ్య తెలిపారు. శనివారం 45వ డివిజన్ రామ్మూర్తి నగర్ ప్రాంతంలో కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తు న్న వారిని కమాండ్ కంట్రోల్ భవనం నుంచి సీసీ కెమెరాల ద్వారా గమనిస్తున్నామన్నారు. కాలువలు, రోడ్లపై పదేపదే వ్యర్థాలు పోసే వారికి ఫొటోలతో సహా ఆధారాలు చూపి జరిమానా వసూలు చేస్తామని చెప్పారు. స్వచ్ఛ నెల్లూరుకు ప్రజలందరు సహకరించాలని కోరారు.

హజ్ యాత్రికులకు ప్రత్యేక వ్యాక్సిన్

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), మే 4 : జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారికి ప్రత్యేక వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య వెల్లడించారు. శనివారం నెల్లూరులోని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ముస్లిం నేతలతో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 156 మంది హజ్ యాత్రకు వెళుతున్నారని, వారికిలో 151 మందికి వ్యాక్సిన్ వేయనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు హజ్ యాత్రికులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ సెలీనాకుమారి, డాక్టర్ నవీన్ కృష్ణ, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ ప్రసూన, డాక్టర్ సుల్తాన, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ నాగేంద్ర, తిరుపతయ్య పాల్గొన్నారు.

వీపీఆర్, నారాయణకు అపూర్వ ఆదరణ

● కేతంరెడ్డి వినోద్‌రెడ్డి సతీమణి దేవి

నెల్లూరు (విద్య), మే 4 : ముస్లిం మైనార్టీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణను అపూర్వంగా ఆదరిస్తున్నారని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి సతీమణి దేవి తెలిపారు. నగరంలోని 43వ డివిజన్‌లో శనివారం ఆమె స్థానిక కుండల దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ ప్రాంతంలో ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు సంతోషంగా స్వాగతిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం తమను మోసం చేసి ఎన్నికల లబ్ధికి వాడుకుందని ఆగ్రహిస్తున్నారన్నారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

చారిత్రక విజయానికి కలిసిరండి!

● రోడ్ షోలో రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 4 : రాష్ట్ర రాజకీయ చరిత్రను తిరగరాసేందుకు ఎన్డీఏ కూటమి విజయానికి ప్రతి వ్యక్తి కలిసి రావాలని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 12వ డివిజన్ వావిలేటిపాడు, ముస్లింపాళెం, చింతారెడ్డిపాళెంలో రోడ్ షో నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరమన్నారు. అప్పుల ఊబిలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రాన్ని కాపాడి తిరిగి ఆర్థిక పురోగతి వైపు అడుగులు వేయాలంటూ ఎన్డీఏ పక్ష పార్టీలు అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే అందమైన ఆంధ్రప్రదేశ్‌ను చూడగలమని చెప్పా రు. మన బిడ్డల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కూటమిని గెలిపించాలని కోరారు. ఐదేళ్ల పాలించమని జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని వెంటిలేటర్ పైకి తీసు కెళ్లాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా నెల్లూరులోని తన కార్యాలయంలో ములుముడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పులి రాంగోపాల్‌ను, నగరంలోని 31వ డివిజన్ వైసీపీ రైతు విభాగం నాయకుడు మురళీనాయుడును కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బత్తల కృష్ణ, సాబ్‌మార్తు అధినేత అప్సర్ బాషా, కుడుము ల నాగేశ్వరరావుగౌడ్ (కేఎన్ఆర్), ఆల్తూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ చైర్మన్ మస్తానయ్య, చింతా ప్రభాకర్‌రెడ్డి, కుండా వెంకట రమణయ్య, గౌస్‌అహ్మద్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న వావిలేటిపాడు యువత



ముస్లింపాళెంలో కార్యకర్తల ర్యాలీ

మాదిగల హక్కుల పరిరక్షణకు కృషి : వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), మే 4 : మాదిగల హక్కుల పరిరక్షణ కోసం తమ వంతుగా కృషి చేస్తామని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వేమిరెడ్డి మాట్లాడుతూ మాదిగలకు ఏ అవసరం వచ్చినా తాము ముందుంటామని హామీ ఇచ్చారు. ఎంపీగా గెలిచిన తరువాత మాదిగలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తమకు మద్దతు తెలిపేందుకు పెద్దఎత్తున మాదిగలు తరలిరావటం ఆనందదాయకమన్నారు. సుబ్బయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు, టీడీపీ నేతలు మాతంగి కృష్ణ, ప్రసాదరావు, బీజేపీ నేతలు బర్రె శ్రీనివాసులు, పలిగిరి చిన్నయ్య, సాల్మన్ పాల్గొన్నారు.



మాదిగల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024

Nellore | Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

9 కేంద్రాల్లో నేడు నీట్

పరీక్ష రాయనున్న 4,692 మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 4: దేశవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ (ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్) కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష ఆదివారం జరగనుంది. ఈ పరీక్షకు 4,692 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. తిరుపతి పరిధిలోని తొమ్మిది (విశ్వం హైస్కూల్, ఎడిఫై స్కూల్, శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్, గీతమ్ స్కూల్, లిటిల్ ఏంజెల్స్ పాఠశాల, శ్లోక ఎ బిర్లా స్కూల్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, మార్గ్ చిన్మయ విద్యాలయ సీనియర్ సెకండరీ స్కూల్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్) కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. పెన్, పేపర్ విధానంలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు.

పోస్టల్ బ్యాలెట్‌కు ప్రలోభాలు



రూ.2వేల నుంచీ రూ.3 వేల దాకా పంపిణీ

తిరుపతి, మే 4 (ఆంధ్రజ్యోతి):పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు ప్రలోభాలు ముమ్మరమయ్యాయి.నేటినుంచీ నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు పోలింగ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 22,299 మంది పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ వంటి కేటగిరీ ఓటర్లుండగా పీవో, ఏపీవో, ఇతర పోలింగ్ అధికారులు వంటి ఎన్నికల విధుల్లో వున్న పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు మాత్రం 16,552మంది వున్నారు. జిల్లాలో నివాసముంటూ ఇతర జిల్లాల్లో ఎన్నికల విధులకు కేటాయించబడిన వారు మరో 3789మంది కూడా ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులు. మొత్తం 20,341 మంది ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలైన వైసీపీ, టీడీపీ గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. కనిష్ఠంగా ఓటుకు రూ. 2 వేల నుంచీ గరిష్ఠంగా రూ. 3 వేల వరకూ ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం.తిరుపతిలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు పెద్దగా డిమాండ్ కనిపించలేదు. అధికార పార్టీ నేతలు కొందరు రంగంలోకి దిగి ఓటుకు రూ. 2 వేల వంతున పంపిణీని ముగించేసినట్టు తెలిసింది. అదే సమయంలో టీడీపీ ,జనసేన వర్గాలు ఓటుకు రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేయనున్నట్టు శనివారం ఉదయం నుంచీ ప్రచారమైతే జరిగింది కానీ పంపిణీ మాత్రం చేయలేదని సమాచారం. చంద్రగిరికి సంబంధించి వైసీపీ వర్గాలు ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలను మినహాయించి మిగిలిన మండలాల్లో ఓటుకు రూ. 3 వేల వంతున సీల్డ్ కవర్లు అందజేసినట్టు తెలిసింది.శుక్రవారం ఉదయం నుంచీ మొదలుపెట్టి శనివారం మధ్యాహ్నానికే పని పూర్తి చేసినట్టు సమాచారం. టీడీపీ విషయానికొస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు కొందరు ముఖ్యనేత వద్దకు వెళ్ళి డబ్బు పంచాల్సిన అవసరం లేదని, తామంతా మూకుమ్మడిగా టీడీపీకే ఓటు వేస్తామని నమ్మబలికినట్టు ప్రచారమవుతోంది. దీన్ని నమ్మి ముఖ్యనేత డబ్బు పంపిణీ వైపు దృష్టి పెట్టలేదని తెలిసింది. అయితే మరి కొందరు నాయకులు జోక్యం చేసుకుని సరికాదని చెప్పడంతో ఎట్టకేలకు రూ. 2 వేల వంతున పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తమకు ఓటు వేస్తారని నమ్మకమున్న వారిని మాత్రమే వైసీపీ నేతలు కలుస్తున్నారని, అలాంటి వారికి మాత్రమే ఓటుకు రూ. 2 వేల చొప్పున ముట్టజెపుతున్నట్టు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ నేతలు మాత్రం ఉద్యోగులందరినీ కలసి ఓట్లు అభ్యర్థించడంతో పాటు రూ. 2 వేల చొప్పున అందరికీ పంపిణీ చేస్తున్నట్టు తెలిసింది.వెంకటగిరిలో ఇరు పార్టీల నాయకులూ ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వైసీపీ రూ. 2500 చొప్పున నగదు పంపిణీ చేయగా టీడీపీ రూ. 2 వేల చొప్పున ఇస్తున్నట్టు సమాచారం. అయితే తీసుకునే వారికే ఇస్తున్నారు తప్ప ఎవరినీ బలవంతపెట్టడం లేదని చెబుతున్నారు.

మూడురోజులపాటు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

● రేపటి నుంచి హోం ఓటింగ్

తిరుపతి(కలెక్టరేట్), మే 4:నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 8 ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది.ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల లోపు ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. జిల్లాలో ఆయా నియోజకవర్గాల పరిధిలో 8 ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.గూడూరులో 3,210మంది, సూళ్ళూరుపేటలో 2,180మంది, వెంకటగిరిలో 2,771మంది, తిరుపతిలో 4,685మంది, శ్రీకాళహస్తిలో 3,021మంది, సత్యవేడులో 1,747మంది, చంద్రగిరిలో 4,685మంది ఓటర్లున్నారు.వీరిలో పీవో, ఏపీవో, పోలింగ్ విధుల్లో ఉన్నవారు 16,552మంది కాగా అత్యవసర విధుల్లో ఉన్నవారు 674మంది. హోం ఓటింగ్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్న వారిలో వయోవృద్ధులు 613మంది, దివ్యాంగులు 526మంది వున్నారు. జిల్లాలో ఓటు వుండి ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారు 3,789మంది వున్నారు. ఇతర జిల్లాల్లో ఓటు వుండి తిరుపతి జిల్లాలో విధుల్లో ఉన్న 5,351మంది తిరుపతి ఎస్వీ క్యాంపస్ హైస్కూల్లోని ఫెసిలిటేషన్ సెంట ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇంట్లోనే ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకున్న 85ఏళ్ల దాటిన వృద్ధులకు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు సోమవారం హోం ఓటింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగు సిబ్బంది ఓటర్ల ఇళ్ల వద్దకే వెళ్లి ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తారు.

గూడూరులో ఫోన్ అభ్యర్థనలు

గూడూరు నియోజకవర్గంలో ఇరు పార్టీల నాయకులూ ఉద్యోగులకు ఫోన్లు చేసి తమకు అనుకూలంగా ఓటు వేయమని అభ్యర్థిస్తున్నారు తప్పితే ప్రలోభాల జోలికి వెళ్ళడం లేదని సమాచారం.పోలింగ్‌కు వెళ్ళడానికి వాహనాలు అవసరమైతే సమకూరుస్తామని మాత్రం చెబుతున్నట్టు తెలిసింది.సూళ్ళూరుపేటలో అయితే రెండు పార్టీల తరపునా ఎవరూ ఉద్యోగులను ఓటడగడం లేదని సమాచారం. ఎలాగూ తమకు ఓటు వేయరన్న భావనతో వైసీపీ నేతలు పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వైపు దృష్టి పెట్టలేదని తెలిసింది. అదే సమయంలో ఎలాగూ తమకే ఓటు వేస్తారు కదా అన్న ఉద్దేశంతో టీడీపీ నేతలు కూడా ఉద్యోగులను టచ్ చేయలేదని సమాచారం.

సత్యవేడులో ఇండిపెండెంట్ అభ్యర్థుల బేరసారాలు

సత్యవేడు నియోజకవర్గంలో పరిస్థితి తారుమారుగా వుంది. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల మద్దతు కోసం టీడీపీ, వైసీపీ రెండూ పట్టించుకోకపోవడం గమనార్హం. వైసీపీ నేతలు తాము అడిగినా ఉద్యోగులు ఓటు వేయరని, డబ్బు ఇచ్చినా ప్రయోజనం వుండదని భావించి ఉద్యోగులకు దూరంగా వున్నట్టు తెలిసింది. వైసీపీ వారు డబ్బిచ్చినా ఉద్యోగులు ఓటేసేది తమకేనన్న ధీమాతో టీడీపీ నేతలు సైతం పట్టించుకోవడం లేదని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. కాకపోతే ఇక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బరిలో వున్న ఇద్దరు అభ్యర్థులు మాత్రం ఓటుకు రూ. 2 వేల చొప్పున పోస్టల్ బ్యాలెట్ ఓటర్లతో బేరసారాలు ఆడుతున్నట్టు సమాచారం.

వైసీపీ నేతల బాహాబాహి

మాచవరంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

ప్రచారం చేయకనే వెనుదిరిగిన ఎమ్మెల్యే కిలివేటి



ఓజిలి, మే 4 : సూళ్లూరుపేట ఎమ్మెల్యే , వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య సమక్షంలోనే వైసీపీ శ్రేణులు బాహాబాహీకి దిగాయి. రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం పిడిగుద్దులు కురిపించుకున్నారు.ఓజిలి మండలం మాచవరంలో శనివారం ఎన్నికల ప్రచారం నిమిత్తం కిలివేటి సంజీవయ్య వచ్చారు. గ్రామానికి చెందిన వైసీపీ నేతలు పి.ఫుల్లారెడ్డి, మధురెడ్డి మధ్య దీర్ఘకాలంగా వర్గ విభేదాలున్నాయి.కిలివేటి సంజీవయ్య రాక సందర్భంగా తాము సూచించిన మార్గంలోనే ప్రచారం మొదలు పెట్టాలంటూ ఇద్దరు నాయకులూ పట్టుబట్టారు.ఈ సందర్భంగా ఇద్దరి మధ్యా మాటామాట పెరిగింది.కిలివేటి సర్దిచెపుతున్నా వినిపించుకోలేదు.ఇద్దరి అనుచరులూ పోటాపోటీ నినాదాలు చేశారు. ఇది కాస్తా శృతిమించి ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు.దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా పోలీసులు కల్పించుకుని సర్దిచెప్పారు. ఈ పరిణామాలతో ఖంగుతిన్న కిలివేటి ఇద్దరు నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రచారం నిర్వహించకుండానే కారెక్కి వెనుదిరిగారు. నిజానికి సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీలో కుమ్ములాటలు రోజూ ఎక్కడో ఒకచోట బహిర్గతమవుతూనే వున్నాయి. గత నెలలో కిలివేటి నామినేషన్ల దాఖలు సమయంలో ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట వైసీపీ పట్టణాధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి బాహాబాహీకి దిగిన విషయం తెలిసిందే. వర్గ విభేదాలతోపాటు పెళ్లకూరు మండలంలో కొన్ని చోట్ల జనం సైతం నిలదీసిన ఘటనలున్నాయి.వారం రోజుల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో వీధి కొట్లాటలకు దిగుతున్న నాయకులు వైసీపీని పుట్టిముంచేస్తారేమోనని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

కత్తులతో యువకుల వీరంగం


పట్టుకుని కట్టేసిన అంజూరు గ్రామస్తులు





కేవీబీపురం, మే 4 : కేవీబీపురం మండలం అంజూరు గ్రామంలో శ్రీకాళహస్తికి చెందిన ఐదుగురు వ్యక్తులు కత్తులతో హల్‌చల్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. తాము వెంబడించి ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించగా ముగ్గురు పరారైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పాత గొడవల నేపథ్యంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని హతమార్చేందుకు వచ్చిన కిరాయి మూకలుగా అనుమానిస్తున్నారు.ఏఎస్‌ఐ కథనం మేరకు...అంజూరుకు చెందిన ధనశేఖర్, వెంకటేశులు మధ్య మూడు నెలల క్రితం భూవివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో ధనశేఖర్‌పై వెంకటేశులు వర్గం దాడికి ప్రయత్నించగా ఇరు వర్గాలూ పోలీసులకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు.దీంతో ఇరువర్గాలపైనా హత్యయత్నం కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ధనశేఖర్‌కు సంబంధించిన వ్యక్తులు శ్రీకాళహస్తి నుంచి అంజూరుకు చేరుకుని కత్తులతో హల్‌చల్ సృష్టించారు. వెంకటేశులుపై దాడికి ప్రయత్నించగా గమనించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో వారు పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి ఇద్దరిని పట్టుకుని స్తంభానికి కట్టేశారు.గట్టిగా ప్రశ్నిస్తే ధనశేఖర్ పంపితే వచ్చామని తెలిపారు. పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించడంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నీ ఫోన్లో వద్దులే.. వాట్సప్ కాల్ చేస్తా!



ఫోన్ ట్యాపింగ్ ఎఫెక్ట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చాలామంది తమ స్నేహితులు, బంధువులు, సన్నిహితులతో మనసువిప్పి ప్రశాంతంగా మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వ్యవహారంలో ఫోన్ ట్యాపింగ్ ఉదంతం ఆ రాష్ట్రాన్ని కుదిపేసింది. ఐపీఎస్ అధికారులు సైతం జైలుకు వెళ్లేలా చేసింది. అదే ఫీవర్ ఇక్కడా పట్టుకుంది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు అనేక ఇతర సంఘాల నాయకులు ఫోన్లో మాట్లాడేందుకు భయపడుతున్నారు. ఎవరు ఫోన్ ట్యాపింగ్‌లో ఉందో.... ఎవరి ఫోన్‌కాల్ రికార్డ్ అవుతుందో... మరెవరి ఫోన్‌స్పీకర్ ఆన్‌లో ఉందో నంటూ భయాభ్రాంతులకు గురవుతున్నారు. ఫోన్‌కాల్ కంటే వాట్సప్ కాల్ ఉత్తమమని భావించిన అనేకమంది ఈ విధానాన్నే పాటిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వాట్సప్ కాల్స్‌లోనే ఎక్కువ మాట్లాడుకుంటున్నారు.

- నెల్లూరు రూరల్

సైరా జోడెద్ల బండి!



ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ జలదంకి మండలం కమ్మపాలెంలో ఎడ్లబండిపై హల్‌చల్ చేశారు. తన తనయుడు సంహిత్‌ను వెంటబెట్టుకుని ఎడ్లను అదిలిస్తూ సురేష్ ముందుకు సాగారు. ఇది ఓటర్లను ఎంతగానో ఆకట్టుకుంది.

- జలదంకి

ఆంధ్రజ్యోతి సిత్రాలు

అవ్వా పెన్షన్ వస్తోందా!?



అవ్వా పెన్షన్ వస్తోందా!? సమస్యలేమైనా ఉన్నాయా!? అంటూ కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి తనయ సంహితారెడ్డి వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తన తండ్రిని గెలిపించాలని కోరుతూ శనివారం కావలి 15వ వార్డులో ఆమె ప్రచారం చేశారు.

- కావలి టౌన్

పెరిగిన జంప్ జిలానీలు



సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు జంప్ చేస్తున్నారు. తమ పార్టీలో చేరేవారికి నిత్యం కండువాలు కప్పడానికే అభ్యర్థులకు సగం సమయం సరిపోతుంది. ప్రధాన పార్టీలకు చెందిన కొందరు స్థానిక నాయకులు అవతలి పార్టీ కార్యకర్తలను, ఓటర్లను తమ పార్టీ అభ్యర్థుల వద్దకు తీసుకెళ్లి, వారి గురించి గొప్పలు చెప్పి పార్టీ కండువాలు వేయిస్తున్నారు. మరోవైపు వీరంతా కోవర్టులే అన్న భయం కూడా వారిని వెంటాడుతుంది.ఈ జంప్ జిలానీలపై ఓ కన్నేసి ఉండాలని విశ్లేషకులు అంటున్నారు.

- వలేటివారిపాలెం

ఎన్నికల ప్రచారంతో ఉపాధి



ఎన్నికల ప్రచారం కొందరికి ఉపాధినిస్తోంది. రెండు గంటల ప్రచారానికి వస్తే రూ. 200 ఇస్తామని ప్రధాన పార్టీల నేతలు పల్లెజనాలను తీసుకు వెళుతున్నారు. ఎండాకాలం కాబట్టి సాయంత్రం రెండు గంటలు వచ్చి మాతో తిరగండి.. మీరు చేయా ల్సింది ఏం లేదు.ఓట్లు అభ్యర్థించడానికి వెళుతున్న అభ్యర్థి వెంట ఉండడమేనని ... ఖాళీగా ఉన్న జనానికి చెప్పి తీసుకెళుతున్నారు. తనకు అంగబలం ఉన్నట్లు చూపించుకునేందుకే అభ్యర్థులు వారిని అలా తీసుకు వెళుతున్నారు. ఏదైతేనేం అలా రెండు గంటలు వెళితే రూ.200 వస్తాయి కదా..? అని ఇంట్లో భార్య, భర్త, పిల్లలు సైతం ప్రచారానికి వెళ్లడం, ఆ పూటకు ఆ నేతకు జై కొట్టడం, రూ. 200 తెచ్చుకోవడం తాత్కాలికంగా ఉపాధి మార్గంగా ఉంది. గ్రామాల్లో రబీ సీజన్ పూర్తి కావడంతో వ్యవసాయ పనులు లేక, ఎండలో ఉపాధి పనులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న వారికి ఇదో అవకాశం. దీంతో ఈరోజు ఎవరు పిలుస్తారా ? అని ఎదురుచూస్తున్నారు.

- సీతారామపురం

ఓ సారి వచ్చిపో మామా...!




ఏం మామా బాగున్నావా.. మీరంతా ఓటేయడానికి రావాలా. వచ్చి పోయే చార్జీలు, ఖర్చులు ఇస్తా. నీతోపాటు అక్కను కూడా తీసుకురా. అలాగే మనవాళ్లందరితో కూడా మాట్లాడతా. నువ్వు కూడా ఓసారి చెప్పు. అందరూ ఒకేసారి వస్తామంటే రిజర్వేషన్ చేస్తా. లేదంటే ఇక్కడ నుంచి బండి పంపుతా. ఎన్నికల రోజున విందు, మందు కూడా సిద్ధం చేస్తా. సరేనా.. మామా...! ఇదీ ప్రస్తుతం వలస ఓటర్లను రప్పించేందుకు అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నాలు.. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో వలస ఓటర్లు అధికం. అభ్యర్థుల గెలుపోటముల్లో వీరే కీలకం. నియోజకవర్గంలో 2,41,861 ఓటర్లు ఉండగా అందులో సుమారు 40 శాతం మంది వలస ఓటర్లే ఉన్నారు. వారిని ఎన్నికల రోజున పిలిపించేందుకు నాయకులు, అభ్యర్థులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు వలసవాసులతో ఆత్మీయ సమావేశాలు సైతం నిర్వహించారు. ఓటుకు, రవాణా ఖర్చులకు వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. మిగతా ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

- ఉదయగిరి రూరల్/ వలేటివారిపాలెం

'వ్యాట్'తో వాత!

'పెట్రో' మోత..

- పెట్రోలు, డిజిల్ ధరపై పన్నుపోటు
- పొరుగు రాష్ట్రాలతో పోల్చితే 6 శాతం ఎక్కువ
- పైగా రోడ్ల అభివృద్ధికంటూ లీటరుపై ఒక శాతం పన్ను
- కర్ణాటక ధరలతో పోల్చితే నెలకు రూ.45.55 కోట్ల వ్యత్యాసం
- తమిళనాడుతో పోల్చితే రూ.19.70 కోట్ల భారం
- వాహనదారుల నడ్డి విరుస్తున్న జగనన్న ప్రభుత్వం



ప్రాంతం	డీజిల్	పెట్రోలు
కర్ణాటక	86.32	98.07
తమిళనాడు	92.34	106.07
నెల్లూరు	97.86	110.07

'రక్తంతో నడుపుతాను రిక్షాను. నా రక్తమే నా రిక్షకు పెట్రోలు. పెట్రోల్ ధర పెరిగింది. డీజిల్‌ధర పెరిగింది." అంటూ ప్రజా గాయకుడు, దివంగత గద్దర్ ఆలపించిన ఈ సినీ గీతం అప్పట్లో ఓ సంచలనమైంది. ఇప్పుడు బండి తాకిన ప్రతిసారీ ప్రతి ఒక్కరికి ఈ పాట గుర్తుకు వస్తోంది. గద్దర్ ఆలపించిన కాలంలో ప్రయాణానికి ప్రత్యామ్నాయం ఉండేది. పెట్రోలు, డీజిల్‌తో పనిలేకుండా శరీర కష్టంతో నడిచే రిక్షాలైనా ఉండేవి. ఇప్పుడు ప్రజలకు ప్రత్యామ్నాయమే లేదు. అన్నీ ఇంధనంతో నడిచే మోటారు రిక్షాలే. ప్రజల విధిలేని పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం బాగానే క్యాష్ చేసుకొంటోంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా పన్ను రూపంలో ప్రజల నెత్తురు తాగేస్తోంది. మన రాష్ట్రంలో పెట్రో ధరలకు, పక్కనున్న తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల ధరలకు నేలకు ఆకాశానికి ఉన్నంత తేడా కనిపిస్తోంది. లీటరుపై పది పైసలు పెరిగితేనే తల్లడిల్లిపోయే సామాన్యులు గత ఐదేళ్లుగా లీటరుపై 5 నుంచి 11 రూపాయల ధర పెరిగినా, దానికి కారణమైన ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం లేక మౌనంగా రోదిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల ధరలతో పోల్చితే మన జిల్లా ప్రజలు నెలకు రూ.20 కోట్ల నుంచి 45 కోట్ల అదనపు భారం మోస్తున్నారు.

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి): మన పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో పెట్రోలు ధర లీటరు రూ.98.07. మన జిల్లాలో 110.07 పైసలు. అంటే 12 రూపాయలు అదనం. జిల్లాలో రోజుకు 4లక్షల లీటర్ల పెట్రోల్ వినియోగిస్తున్నారు. కర్ణాటక ధరతో పోల్చితే ఒక రోజుకు రూ.48 లక్షలు (దాదాపుగా అర కోటి) జిల్లావాసులు అదనంగా చెల్లిస్తున్నారు. ఈ లెక్కన నెలకు 14.40 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేస్తోంది. ఇక డీజిల్ విషయానికి వస్తే కర్ణాటకలో లీటరు రూ.86.32. మన జిల్లాలో రూ. 97.86. అంటే లీటరుపై రూ.11.54 అదనం. జిల్లాలో ఒకరోజుకు 9 లక్షల లీటర్ల డీజిల్ వినియోగం జరుగుతోంది. ఈ లెక్కన రోజుకు సుమారు రూ.1.03 కోట్లు. నెలకు రూ.31.15 కోట్లు అదనంగా చెల్లిస్తున్నాము. కర్ణాటకతో పోల్చితే జిల్లా వినియోగదారులు పెట్రోలు, డీజిల్ రెండింటి ద్వారా నెలకు 45.55 కోట్ల రూపాయలు అదనంగా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు.

● తమిళనాడుతో పోల్చితే..

తమిళనాడులో పెట్రోలు లీటరు రూ.106.07. మన జిల్లాలో రూ.110.07. వ్యత్యాసం లీటరుకు 4రూపాయలు. మన వినియోగం రోజుకు 4 లక్షల లీటర్లు. ఈ లెక్కన ఒక రోజుకు మనం అదనంగా చెల్లించే మొత్తం రూ. 16 లక్షలు. నెలకు రూ.4.80 కోట్లు. ఇక తమిళనాడులో డీజిల్ ధర లీటరు రూ.92.34. మన జిల్లాలో రూ.97.86. వ్యత్యాసం రూ.5.52. రోజుకు మన వినియోగం 9లక్షల లీటర్లు. అంటే రోజుకు జిల్లావాహనదారులు చెల్లించే అదనపు ధర రూ.49.68 లక్షలు. నెలకు రూ.14.90 కోట్లు. పెట్రోలు, డీజిల్ రెండింటిపై తమిళనాడు రేట్లతో పోల్చితే మనం అదనంగా చెల్లించే మొత్తం నెలకు రూ.19.70 కోట్లు.

● పన్ను పోటే అసలు కారణం

పొరుగు రాష్ట్రాలకు, మన రాష్ట్రంలో పెట్రో ధరకు ఇంత భారీగా వ్యత్యాసం ఉండటానికి కారణం కేవలం రాష్ట్ర ప్రభుత్వమే. పక్క రాష్ట్రాల కన్నా ఎక్కువ శాతం పన్ను వేయ డంతో ఇక్కడ ధరలు ఇంత భారీగా పెరిగాయి. కర్నాటకలో 25.92 శాతం వ్యాట్ (పన్ను) వసూలు చేస్తున్నారు. తమిళనాడులో 13శాతం వ్యాట్‌తో పాటు ఒక లీటరుకు రూ11.52 అదనంగా వసూళ్లు చేస్తున్నారు. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా భారీగా పన్ను వసూళ్లు చేస్తోంది. 31 శాతం వ్యాట్‌తోపాటు ప్రతి లీట రుపై అదనంగా 5 రూపాయలు వసూళ్లు చేస్తోంది. ఈ ఐదు రూపాయల్లో ఒక రూపాయి రోడ్ల అభివృద్ధి కోసం అన్నట్లు చూపిస్తోంది. ఇంత భారీ స్థాయిలో వ్యాట్ పెంచిన కారణంగానే పొరుగు రాష్ట్రాలతో పోల్చితే మన దగ్గరే భారీ వ్యత్యాసం వస్తోంది.

నా సంపాదనలో సగం పెట్రోల్‌కే!



15 సంవత్సరాలుగా నేను ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నా. గతే డాది ఏప్రిల్ లో ముడి చమురు ధరలు జీవితకాల కనిష్ఠానికి చేరినా మన దేశంలో మాత్రం తగ్గలేదు. పైగా పెరుగుతూ వస్తున్నాయి. నా సంపాదన సగం పెట్రోల్ ఖర్చులకే సరిపోతోంది. ఎన్నికల హడావిడి ప్రారంభమవడంతో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధర కాస్త తగ్గించినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను తగ్గించక పోవడంతో ముడి సరుకు, కూరగాయల రవాణా చార్జీలు పెరిగిపోయాయి. మా లాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి.

- పాలిశెట్టి శ్రీనివాసులు, సీతారామపురం

టాక్సుల భారమే ఎక్కువ



ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు ఉన్నాయి. వ్యాట్ పేరుతో అధికంగా వసూలు చేస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వ్యాట్ తక్కువగా ఉండి మనకంటే 12 రూపాయలకు తక్కువగా ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ తగ్గించి పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి.

- రావిళ్ల శ్రీనివాస్ నాయుడు, నెల్లూరు

పెట్టుబడులు పెరిగిపోయాయి!



పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగి పెట్టుబడులు అధికమవుతున్నాయి. దిగుబడులు రవాణా చేయాలన్న, వ్యవసాయ ఉత్పత్తులు తెప్పించుకోవాలన్న అవస్థలు తప్పడం లేదు.

- రమణయ్య, అనంతసాగరం

అన్ని విధాలుగా లాగేశారు!

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే లీటరుకు పది రూపాయలకుపైగా మనరాష్ట్రంలో వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. కనీసం ఎన్నికల సమయంలోనైనా ఈ భారం తగ్గిస్తారని ఆశించాం. అయితే అందుకు విరుద్ధంగా ధరలు పెంచడం దుర్మార్గం. బటను నొక్కుడు అంటూ ఊరిస్తూ ఎన్నివిధాలుగా జేబుకు చిల్లుపెట్టి లాక్కోవాలో అన్నివిధాలుగా లాక్కుంటున్న దయనీయ పరిస్థితి రాష్ట్రంలో ఉంది.

- మంగపాటి శ్రీను, వరపర్లవారిపాలెం, కందుకూరు


టెక్నాలజీతో వలస ఓటర్లకు వల

వలస ఓటర్లకు ఎరవేయటంలో అభ్యర్థులు టెక్నాలజీని ఎంతో బాగా వినియోగించుకుంటున్నారు. వలస ఓటర్లు అధికంగా ఉండే కందుకూరులో ఎన్నికల రోజున వారిని గ్రామాలకు రప్పించుకుని మిస్‌కాకుండా ఓట్లు వేయించుకునేందుకు వారు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గంలో 60వేలకుపైగా వలస ఓటర్లు ఉన్నట్లు అంచనా. గతంలో వలస ఓటర్లు అంటే బేల్దారి పని, ఇతరత్రా శ్రమజీవులు మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం వీరితోపాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, బిల్డర్లు, వివిధ వ్యాపారాల కోసం నగరాల్లో స్థిరపడినవారు ఉన్నారు. కందుకూరు ప్రాంతానికి చెందిన వారు బెంగళూరు, హైదరా బాద్, చెన్నైలలో ఎక్కువగా స్థిరపడి ఉన్నారు. ఇక దేశంలోని అనేక నగరాలలో కూడా ఈప్రాంత వాసులు స్థిరపడ్డారు. గతంలో వారందరినీ సమీకరించుకుని ఓ బస్సో, ప్రత్యేక వాహనమో ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవటంతో నేతలు టెక్నాలజీని వాడుతున్నారు. వారి ఫోన్‌నెంబర్లు తీసుకోవటం, వారితో నేరుగా మాట్లాడడం చేస్తున్నారు. ఓటేసేందుకు సుముఖత వ్యక్తంచేసేవారికి రానుపోను ఛార్జీలు కూడా ఫోన్‌పే, గూగుల్‌పే, అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఇందుకోసం పార్టీ కార్యాలయాల్లో టెక్నాలజీ తెలిసిన యువతను ప్రత్యేకంగా నియమించుకున్నారు. ఎన్నికల రోజు బస్సులు, ఇతర వాహనాలు దొరికే పరిస్థితి ఉండదని, ముందస్తు ప్రణాళిక లేకుంటే రైళ్లు, బస్సుల్లో కూడా టికెట్లు దొరికే పరిస్థితి ఉండదని గుర్తించి ముందస్తుగానే డబ్బు పంపుతున్నారు. మీ ఏర్పాట్లు మీరు చేసుకోవాలని వలసఓటర్లకు సూచిస్తున్నారు.

● తెలంగాణపై ప్రత్యేక దృష్టి

తెలంగాణలో స్థిరపడిన వలస ఓటర్లపై ఇరుపార్టీల నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. మే 13న రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ, ఇక్కడ ఓటు ఉన్నవారు ఇక్కడ ఓటుకు రాకపోవచ్చన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ కేవలం పార్లమెంటు ఎన్నికలే అయినా ఓటుకు నోటు వ్యవహారం దండిగానే జరుగుతున్నందున ఇంత ప్రయాస పడి ఇక్కడికి వచ్చి ఓటు వేసేందుకు ఆసక్తి చూపరేమోనని అనుమానిస్తున్న నేతలు వారితో ప్రత్యేకంగా మాట్లాడుతు న్నారు. ఆంధ్రాలో అసెంబ్లీ ఎన్నికలు అయినందున మీరు తప్పకుండా రావాలని అభ్యర్థిస్తున్నారు. అలాంటివారికి అదనంగా కొంతమొత్తం చెల్లించేందుకైనా సిద్ధపడుతున్నారు.

- కందుకూరు



ఉద్యమాల పురిటిగడ్డ కావలి

ముఖచిత్రం



కావలి, మే 4 : చరిత్రలో కావలి నియోజకవర్గానికి ఓ విశిష్టస్థానం ఉంది. పట్టణంలో జవహర్ భారతి (జేబీ) కళాశాల ఏర్పాటుతో విద్యా కేంద్రంగా పేరొందింది. జేబీలో విద్యను అభ్యసించిన వారిలో అనేకమంది మేధావులు ఉన్నారు. ఇక్కడ చదివిన వారు అనేక ప్రాంతాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నారు. ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు పార్టీ లాంటి వామపక్షభావాలు ఉన్నవారు కూడా కావలిలో ఎక్కువే. ఇక్కడ చైతన్యవంతులు ఎక్కువగా ఉండటంతో ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరొందింది. ఎలాంటి ఉద్యమాలైనా తొలుత కావలిలోనే ప్రారంభమవుతాయి. సారా ఉద్యమం కూడా తొలుత కావలి నియోజకవర్గ పరిధి దూబగుంటలోనే పుట్టింది. సారా ఉద్యమం ద్వారా దూబగుంట రోశమ్మ రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ ఉద్య మంతో దేశవ్యాప్తంగా కావలికి గుర్తింపు వచ్చింది. అలాగే వస్త్రవ్యాపారంలో రెండో ముంబాయిగా కావలి గుర్తింపు పొందింది. తద్వారా ఎంతోమందికి ఉపాధి కలిగింది. ఇన్ని ప్రత్యేక తలు ఉన్న కావలి రాజకీయాల్లోనూ తనకంటూ ప్రత్యేకతను కలిగిఉంది.



● ఎక్కువసార్లు కాంగ్రెస్‌దే విజయం

కావలి నియోజకవర్గం 1952లో ఏర్పడగా, ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 6 పర్యాయాలు కాంగ్రెస్, 3 పర్యాయాలు టీడీపీ, 2 పర్యాయాలు ప్రజాపార్టీ, 2 సార్లు వైసీపీ, 2 సార్లు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కలికి యానాదిరెడ్డి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మంత్రివర్గంలో సహకార శాఖ, దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పటివరకు 10 మంది ఎమ్మెల్యేగా పనిచేయగా, వారిలో కలికి యానాదిరెడ్డికి మాత్రమే మంత్రి పదవి లభించింది. 2009లో నియోజక వర్గ పునర్విభజన జరిగింది. 2009 వరకు కావలి పట్టణం, కావలి రూరల్, జలదంకి, కలిగిరి, కొండాపురం, దగదర్తిలో కొంతభాగం కావలి నియోజకవర్గ పరిధిలో ఉండేవి. 2009లో పునర్విభజన అనంతరం కావలి పట్టణం, కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలు కావలి నియోజకవర్గ పరిధిలో చేరాయి.

ఇప్పటి వరకు కావలిలో గెలిచిన వారు

సంవత్సరం	గెలిచిన వారు	పార్టీ
1952	బత్తిన రామకృష్ణారెడ్డి	ప్రజాపార్టీ
1955	బత్తిన రామకృష్ణారెడ్డి	ప్రజాపార్టీ
1962	ఎల్లంపల్లి పెంచలయ్య	కాంగ్రెస్
1967	గొట్టిపాటి సుబ్బులునాయుడు	స్వతంత్ర
1972	గొట్టిపాటి కొండపనాయుడు	స్వతంత్ర
1978	కలికి యానాదిరెడ్డి	కాంగ్రెస్
1983	పాతాళపల్లి వెంగళరావు	టీడీపీ
1985	కలికి యానాదిరెడ్డి	కాంగ్రెస్
1989	కలికి యానాదిరెడ్డి	కాంగ్రెస్
1994	కలికి యానాదిరెడ్డి	కాంగ్రెస్
1999	వంటేరు వేణుగోపాల్ రెడ్డి	టీడీపీ
2004	మాగుంట పార్వతమ్మ	కాంగ్రెస్
2009	బీద మస్తాన్‌రావు	టీడీపీ
2014	రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడి	వైసీపీ
2019	రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి	వైసీపీ



ఇదీ మందు

ఎన్నికల వేళ ఓటర్లందరూ ఆత్మీయులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు తిరుపతిలో పార్టీల నాయకులు. ఎవరినీ,ఏవర్గాన్నీ వదలకుండా మచ్చిక చేసుకుంటున్నారు. కులం కార్డును ఉపయోగించడానికీ వెనకాడ్డంలేదు. ఏ సామాజిక వర్గానికి ఏ ప్రాంతంలో ఎన్ని ఓట్లు ఉన్నాయో ఆరా తీస్తున్నారు. కులపెద్దలను పిలిపించుకుని ఎన్నడూ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. మీటింగులు పెడుతున్నారు. విందు భోజనాలు పెడుతూ ప్రసన్నం చేసుకుంటున్నారు. వరసలూ కలిపి ముచ్చటిస్తున్నారు. ఇదే మంచి అవకాశంగా భావించి కులసంఘ నాయకులు తమ సమస్యలు ఏకరవు పెడుతూ హామీలు పొందుతున్నారు. నాయకులు కూడా సాధ్యాసాధ్యాలు చూడకుండా మాటిచ్చేస్తున్నారు. ఆఖరుకు ఓబీసీలోనూ చేర్పిస్తామని హామీలు గుప్పిస్తున్నారు. సామాజిక వర్గాలకే కాదు వర్గ కులకూ అడిగిందల్లా చేస్తామంటూ నమ్మిస్తున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)



ముఖం చాటేస్తున్నారు...

అగ్రనేతలెవరూ ప్రచారానికి రావడంలేదంటూ నగరి నియోజకవర్గ వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారు. ఒకపక్క అసంతృప్తుల బుజ్జగింపులో రోజా బిజీబిజీగా ఉండడం, పార్టీకి చెందిన పెద్దలెవరూ రాకపోవడంతో ఇదెక్కడి పరిస్థితి రా బాబూ అంటూ తెగ బాధపడిపోతున్నారు. నగరి నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు తరఫున ప్రచార సభను మార్చిలోనే నిర్వహించారు. పీసీసీ చీఫ్ షర్మిల కూడా కాంగ్రెస్ పక్షాన పుత్తూరులో సభను నిర్వహించారు. వైసీపీ తరఫున మాత్రం ఇప్పటి వరకు ఆ పార్టీ అగ్రనాయకత్వం నుంచి ఎవరూ ప్రచారపర్వంలో పాల్గొనకపోవడంపై ఆ పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో జగన్ పుత్తూరులో సభ నిర్వహించారు. ఈసారి మాత్రం పూతలపట్టు వచ్చిన జగన్ అక్కడే రోజాను ఆశీర్వదించాలని ప్రకటించి వెళ్లిపోయారు. అసలే నగరిలో రోజాకు పరిస్థితి అంత ఆశాజనకంగా లేదనే ప్రచారం నేపథ్యంలో ప్రత్యేకించి వైసీపీ టాప్ లీడర్ షిప్ దూరంగా ఉండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- పుత్తూరు అర్బన్







రోజా మేడం.. గుర్తుందా ఇది మీ శాఖే!

జగన్నాటకం పర్యాటకం

జగనన్న పాలనలో పర్యాటకం పడకేసింది. పైసా విదిల్చని ప్రభుత్వంలో పర్యాటకశాఖకు మంత్రి అయిన రోజా జిల్లా కోసం అంగుళం అభివృద్ధి పనికూడా చేయలేక చేతులెత్తేశారు. ప్రతిపక్షాల మీద నోరేసుకుని విరుచుకుపడిపోవడమే తప్ప, నిధులు ఇవ్వు జగనన్నా అని ఒక్కసారి కూడా అడిగి సాధించుకోలేకపోయారు. తెలుగుదేశం ప్రభుత్వంలో సాధించిన ప్రగతి మినహా తిరుపతి జిల్లాకు చెప్పుకోవడానికి ఒక్కటి కూడా వైసీపీ ప్రభుత్వానికి లేదు. అయినా నిస్సిగ్గుగా మళ్లీ మరో ఛాన్స్ అడుగుతున్నారని జనం ఆశ్చర్యపోతున్నారు. పిచ్చి తుప్పల పాలైన జిల్లా పర్యాటకంపై ఆంధ్రజ్యోతి సచిత్ర కథనం...

- తిరుపతి ..తడ (ఆంధ్రజ్యోతి)



నేలపట్టులో పిచ్చిమొక్కల మధ్య శిథిలావస్థలో ఉన్న రిసార్ట్‌లు

శిథిలావస్థకు తొలి అతిథి భవనం

జిల్లాలోని ఏకైక బీచ్‌గా గుర్తింపు పొందిన వాకాడు మండలం తూపిలిపాలెం బీచ్‌లో పర్యాటకులు విడిది చేసేందుకు 1987లో టీడీపీ ప్రభుత్వం స్వర్ణముఖి అతిథి భవనం నిర్మించింది. ఐదేళ్లుగా పట్టించుకునేవాళ్లు లేక శిథిలావస్థకు చేరుకుంది.



తూపిలిపాలెం బీచ్‌లో శిథిలావస్థకు చేరిన స్వర్ణముఖి టూరిజం గెస్ట్ హౌస్.

నెరవేరని స్వదేశీ దర్శన్ కలలు!

కేంద్ర స్వదేశీ దర్శన్ కార్యక్రమం కింద 2017లో నేలపట్టులో రూ.5 కోట్లతో రిసార్టు, చిల్డ్రన్స్ పార్కు, పర్యాటకుల విడిది కోసం ఉడ్ హౌస్‌లు కట్టారు. 2019 నాటికి పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు వాటిని ప్రారంభించలేదు. ఇప్పుడు రిసార్టు పిచ్చిమొక్కల నడుమ అడవిని తలపిస్తుండగా ఉడ్ హౌస్ శిథిలావస్థకు చేరుతోంది. బీవీపాలెంలో ని నిర్మాణాల్లో పెండింగ్ పదిశాతం పనులు పూర్తిచేయడానికి వైసీపీ ప్రభుత్వానికి నాలుగున్నరేళ్ళు పట్టింది.



నేలపట్టులో నిరుపయోగంగా వున్న పెలికాన్ గెస్ట్ హౌస్‌లు

పెలికాన్ గెస్ట్ హౌస్‌లు ఏమయ్యాయి?

దొరవారిసత్రం మండలం నేలపట్టులో 2001లో చంద్రబాబు ప్రభుత్వం రూ.37 లక్షలతో రెండు పెలికాన్ అతిథి గృహాలను నిర్మించింది. ఐదేళ్ళ పాటు విజయవంతంగా నడిచినా వైసీపీ ప్రభుత్వం ఈ అతిథి గృహాలను ఏమాత్రం పట్టించుకోలేదు.

అతీగతీ లేని టూరిజం స్టార్ హోటల్

2015లో తిరుపతిలో యాత్రికుల కోసం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మించేందుకు నాటి సీఎం చంద్రబాబు స్టార్ హోటల్ మంజూరు చేశారు. 2016లో రుయా ఆస్పత్రి ఎదురుగా రూ.25 కోట్ల అంచనా వ్యయంతో ఏడంతస్తులు, 103 గదులతో హోటల్ నిర్మాణం పూర్తయినా వైసీపీ ప్రభుత్వం ఫినిషింగ్ పనులు కూడా చేపట్టలేదు.



తిరుపతిలో అసంపూర్తిగా వున్న టూరిజం స్టార్ హోటల్ భవనం.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏమైంది?



దొరవారిసత్రం మండలం నేలపట్టులో పులికాట్ సరస్సు, పక్షుల అభయారణ్యం నేపథ్యంలో నాటి సీఎం చంద్రబాబు 2000లో ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభించారు. ఏటా మూడు రోజుల పాటు జరిగిన పక్షుల పండుగ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక 2020 నుంచీ ఆగిపోయింది. .

పున్నమి రెస్టారెంటు కథ కంచికి!

నేలపట్టులోనే రూ.98 లక్షలతో పున్నమి రెస్టారెంట్‌ను 2003లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మూతపడినా 2014లో టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. వైసీపీ ప్రభుత్వంలో మళ్ళీ మూతపడింది. తెరిపించేందుకు కనీస ప్రయత్నం జరగలేదు.

నేలపట్టులో నిరుపయోగంగా పున్నమి రెస్టారెంట్





బీవీపాళెం వద్ద నిర్మించిన రిసార్ట్‌లు

రోజా హయాంలో ప్రతిపాదనలకే పరిమితం

2022లో రోజా పర్యాటక శాఖ మంత్రి అయ్యాక రూపొందించిన ప్రతిపాదనలేవీ కార్యరూపం దాల్చలేదు. నవాబ్‌పేట, మొనపాలెం లైట్ హౌస్, తూపిలిపాలెం, శ్రీనివాససత్రాలలో బీచ్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు, నివేదికలు కాగితాలకే పరిమితమయ్యాయి. వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద భారీ రిసార్టు, తలకోన, కళ్యాణి డ్యామ్‌ల వద్ద రిసార్టులు, రెస్టారెంట్లు ఏర్పాటు కాలేదు. రాయలచెరువు బోటింగ్‌కు కదలిక లేదు. తిరుచానూరు-పద్మావతీపురంలో మహిళా ప్రాంగణం పక్కన ఐదు ఎకరాలలో భారీ రిసార్టు, బార్, రెస్టారెంట్, పిల్లల వినోద వేదిక ఏర్పాటు ప్రతిపాదనకూ కదలిక లేదు.

ఒబరాయ్ హోటల్ పనులేవీ..

గతేడాది ఆగస్టులో సీఎం జగన్ కడప జిల్లా నుంచీ వర్చువల్‌గా తిరుపతి ఒబరాయ్ హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ నిర్మాణ పనులు మొదలు కాలేదు. ఒబరాయ్ హోటల్స్ గ్రూప్‌కు అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో 20 ఎకరాలు లీజుపై కేటాయించి తర్వాత పట్టించుకోలేదు.

నిధులు మురిగిపోయినా..

ఇరకం దీవిలో రిసార్టులు నిర్మించి బీవీ పాలెం నుంచీ స్పీడ్ బోట్లలో పర్యాటకులను దీవికి చేర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. అప్పటి నుంచీ నిధులు మురిగిపోతున్నా పర్యాటక మంత్రిగా రోజా కనీస చొరవ తీసుకోలేదు.

మంత్రి ఇలాకాలో మద్యం షాపు

2003లో టీడీపీ ప్రభుత్వం పుత్తూరులో పున్నమి రెస్టారెంట్ నిర్మించినా కాంగ్రెస్ హయాంలో మూత పడింది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే రోజా పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నా తెరిపించే ప్రయత్నం చేయలేదు. రెస్టారెంటును తెరిపించకపోగా అందులో ప్రభుత్వ మద్యం షాపు నిర్వహిస్తుండడం గమనార్హం.



పుత్తూరులో మూతపడిన టూరిజం రెస్టారెంటులో ప్రభుత్వ మద్యం షాపు నిర్వహణ

శ్రీకాళహస్తి పున్నమికి చీకట్లు


శ్రీకాళహస్తి పట్టణం మిట్ట కండ్రిగలో హరిత రెస్టారెంట్ 2019 వరకూ కళకళలాడింది. వైసీపీ ప్రభుత్వం రావడంతో నిర్వహణ లోపాలతో మూతపడే స్థితికి చేరుకుంది.



శ్రీకాళహస్తిలో మూసివేత దశకు చేరుకున్న టూరిజం రిసార్టు, రెస్టారెంట్

రాయలచెరువులో సాగని బోటు షికార్

2016లో టీడీపీ ప్రభుత్వం రామచంద్రాపురం మండలం రాయలచెరువులో బోటు షికారు ప్రారంభించింది. పది బోట్లు పర్యాటకులతో బిజీగా నడిచేవి. 2018లో నీరు తగ్గడంతో బోటు షికారుకు బ్రేక్ పడింది. 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇది పూర్తిగా అటకెక్కింది.



పిక్నిక్ స్పాట్‌గా పేరొందిన రాయలచెరువు

చేనేత సిరి..వెంకటగిరి



● నియోజకవర్గం చరిత్ర

వెంకటగిరి రూరల్,డక్కిలి, బాలాయపల్లి,సైదాపురం, రాపూరు, కలువాయి, వెంకటగిరి మున్సిపాలిటీ

వెంకటగిరి అనగానే చేనేత, స్వాతంత్రం రాకముందు వెంకటగిరి రాజా పరిపాలన గుర్తుకు వస్తాయి. వెంకటగిరిలో నేటికీ రాజాలు ఈ ప్రాంతాన్ని పాలించిన ఆనవాళ్ళు పురాతన భవన కట్టడాల రూపంలో కనిపిస్తాయి. ఇప్పటికీ ఇక్కడి రాజ వంశీకులు నాటి సాంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. చేనేతకు వెంకటగిరి పెట్టింది పేరు. అగ్గిపెట్టెలో పట్టేంత జరీచీరను నేసిన కళా నైపుణ్య చరిత్ర ఇక్కడి నేత కార్మికుల సొంతం. ఇక్కడ తయారైన చీరలు దేశ విదేశాల్లో ప్రాచుర్యం గడించాయి. రాజకీయల్లో కూడా ఈ నియోజకవర్గం ప్రత్యేక ముద్ర వేసుకుంది. ముఖ్యమంత్రితో పాటు పలు పదవులను అలంకరించిన నేదురుమల్లి జనార్దనరెడ్డి రాజకీయ జీవితం ప్రారంభమైంది ఇక్కడ నుంచే. నాటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన సమయంలోనే వెంకటగిరి నియోజకవర్గం ఏర్పడింది. ఈ నియోజకవర్గం ఆవిర్భవించిన 72 ఏళ్లలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఎనిమిది సార్లు కాంగ్రెస్, ఐదు సార్లు తెలుగుదేశం అభ్యర్థులు, ఇండిపెండెంట్, వైసీపీలు ఒక్కోసారి విజయం సాధించాయి.

- వెంకటగిరి/డక్కిలి

ఎమ్మెల్యేలు

1952	పాదిలేటి వెంకటస్వామిరెడ్డి	కాంగ్రెస్
1955	పాదిలేటి వెంకటస్వామిరెడ్డి	కాంగ్రెస్
1955	కమతం షణ్ముగం (ద్విసభా నియోజకవర్గం)	కాంగ్రెస్
1962	అల్లం కృష్ణయ్య	కాంగ్రెస్
1967	ఓరేపల్లి వెంకటసుబ్బయ్య	ఇండిపెండెంట్
1972	ఓరేపల్లి వెంకటసుబ్బయ్య	కాంగ్రెస్
1978	నల్లపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి	కాంగ్రెస్
1983	నల్లపురెడ్డి చంద్రశేకరరెడ్డి	టీడీపీ
1985	వివి సాయికృష్ణయాచేంద్ర	టీడీపీ
1989	నేదురుమల్లి జనార్దనరెడ్డి	కాంగ్రెస్
1994	వివివి రాజగోపాలకృష్ణయాచేంద్ర	టీడీపీ
1999	నేదురుమల్లి రాజ్యలక్ష్మి	కాంగ్రెస్
2004	నేదురుమల్లి రాజ్యలక్ష్మి	కాంగ్రెస్
2009	కురుగొండ్ల రామకృష్ణ	టీడీపీ
2014	కురుగొండ్ల రామకృష్ణ	టీడీపీ
2019	ఆనం రామనారాయణరెడ్డి	వైసీపీ

నియోజకవర్గం ఏర్పడింది : 1952

ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 15

ఓటర్లు

మొత్తం : 2,39,240

పురుషులు : 1,16,936

మహిళలు : 1,22,300

ఇతరులు : 04

ఆదరణ కోసం ఆ దరువు



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డప్పు కొడుతూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. తమ పార్టీ అభ్యర్థి మురళిని గెలిపించాలంటూ తిరుపతి లెనిన్ నగర్‌లో శనివారం ఆయన ఎన్నికల శంఖారావం పూరించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేది తమ పార్టీ ఒక్కటేనని రామకృష్ణ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

-తిరుపతి (ఆటోనగర్)

208 మంది వలంటీర్ల రాజీనామా

వాకాడు/చిల్లకూరు/గూడరు/కోట, మే 4: వాకాడు మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 103 మంది వలంటీర్లు శనివారం ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శికి రాజీనామాపత్రాలు అందించారు. చిల్లకూరు మండలంలో 81మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. గూడూరు మండలం రామలింగాపురంలో 11 మంది, నెర్నూరులో ఒకరు, దివిపాళెంలో ముగ్గురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో రాజశేఖర్‌రావుకు అందజేశారు. కోట మండల పరిధిలోని తిమ్మనాయుడుపాళెం పంచాయతీకి చెందిన 8మంది వలంటీర్లు తమ రాజీనామాపత్రాలను ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు.

టీడీపీ అభ్యర్థిని గెలిపించండి

గూడూరు, మే 4: రాబోయే ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ గెలుపునకు కృషిచేయాలని సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ పరిధిలోని పాస్టర్లతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే చర్చిల నిర్మాణం, పునరుద్ధరణకు ఆర్థికసాయం, శ్మశానవాటికలకు స్థలం కేటాయించడం, జెరూసలెం యాత్రికులకు సాయం అందించడం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుపరిచేలా మేనిఫెస్టోను రూపొందించారన్నారు. వైసీపీ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఇజ్రాయిల్‌కుమార్, కరిముల్లా, సురేంద్రబాబు, రత్నశేఖర్, డేవిడ్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

గూడూరు, మే 4: రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కె.హరిచంద్రారెడ్డి అన్నారు. శనివారం త్యాగరాజవీధిలో టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే చంద్రబాబును సీఎంగా చేసుకోవాల్సి అవసరం ఉందన్నారు. సమష్టిగా పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణమనాయుడు, చంద్రనీల్, శ్రీధర్, చెంచురామయ్య, రహీం, రవీంద్రరెడ్డి, సందీప్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో ప్రతి ఇంటా వెలుగు: టీడీపీ

సూళ్లూరుపేట, మే 4: చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఇంటా వెలుగులు నింపుతాయని టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి అన్నా రు. శనివారం సూళ్లూరుపేట పట్టణంలోని అఫ్ఘన్ వీధి, చాకలి, వెంకటేశ్వరస్వామి ఆలయవీధి, బాపూజీ వీధిలో ఆయన టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కూటమి అభ్య ర్థులు నెలవల విజయశ్రీ, వెలగపల్లి వరప్రసాద రావును గెలిపించాలని కోరారు. పెరుమాల్, నాపా మునిరాజా, బి.విజయలక్ష్మి, మంజులా, బి.శారద, జనసేన నాయకులు పొన్నా కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విస్తృత ప్రచారం

నాయుడుపేట టౌన్, మే 4: మండలంలోని పండ్లూరు, అగ్రహారం, చిలమత్తూరుల్లో బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం శనివారం చేపట్టారు.ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వరప్రసాద్, విజయశ్రీని గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి కోరుతూ కరపత్రాలు అందజేశారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట



అధికారులకు సూచనలిస్తున్న సెబ్ ఏఎస్పీ రాజేందర్

గూడూరు, మే 4: సార్వత్రిక ఎన్నికల్లో అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని సెబ్ ఏఎస్పీ రాజేందర్ అన్నారు. శనివారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్, సెబ్, మెరైన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎక్కడా అక్రమంగా మద్యం రవాణా జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసులు, సెబ్, మెరైన్ సిబ్బంది అక్రమ మద్యం రవాణాను నియంత్రించేందుకు సమష్టిగా ప్రణాళిక రూపొందించామన్నారు. ఎక్కడైనా మ ద్యాన్ని అక్రమంగా రవాణా చే స్తుంటే ప్రజలు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు అండగా టీడీపీ

వెంకటగిరి/ డక్కిలి, మే 4 : టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు టీడీపీ అండగా నిలుస్తున్నారని, నామినేటెడ్ పదవుల్లో వారికి ప్రాధాన్యం ఇస్తామని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు. శనివారం ఆమె తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి మండల కేంద్రంలో బీసీ కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఇదివరకే చెప్పారన్నారు. అలాగే ప్రత్యేక చట్టం తీసుకువస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నలుగురు బీసీలను హత్య చేసిన దృష్ట్యా వారి కోసం చట్టం తీసుకొస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారన్నారు.

వైసీపీకి వచ్చేవి 30 సీట్లే

తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతామోహన్



ఆర్టీసీ బస్టాండ్ వద్ద చింతా ప్రచారం

సూళ్లూరుపేట, మే 4: రాష్ట్రంలో వైసీపీ పతనం ప్రారంభమైందని జగన్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీకి ఈసారి 30 అసెంబ్లీ స్థానాలకే పరిమితమవడం ఖాయమని తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి చందనమూడి శివతో కలసి సూళ్లూరుపేట పట్టణం సూళ్లూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో జగన్‌కు ఓటువేసి ప్రజలు తప్పు చేశారన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ చేస్తుందన్నారు. నల్లధనాన్ని వెలికితీసి ప్రతి పేద కుటుంబానికి రూ.15 లక్షల జమ చేస్తామని చెప్పి ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను మోసం చేశారన్నారు. కన్నబాకం హరికృష్ణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. తడ మండల పరిధిలోని పూడి, పూడికుప్పం, తడ బజారు సెంటర్‌లో రాజేంద్ర తదితరులతో కలిసి ప్రచారం చేశారు.

రేపటినుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం

గూడూరు అర్బన్, మే 4: పట్టణంలోని ఏ.ఏ.రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 6వ తేదీ నుంచి గూడూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు గూడూరు క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు మునిగిరీష్ తెలిపారు.15 సంవత్సరాల లోపు క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు.

పిచ్చి కుక్క దాడి: ముగ్గురికి గాయాలు

వెంకటగిరిటౌన్, మే 4: పట్టణంలోని తొలిమిట్టలో ఓ పిచ్చి కుక్క హల్‌చల్ చేసింది. శనివారం ఉదయం అంకమ్మ చెట్టు వద్ద పిచ్చి కుక్క ఓ ఆవు దూడను కరవడంతో స్థానికులు అప్రమత్తం అయ్యారు. మధ్యాహ్నం నాటికి మరో ముగ్గురిని కరవడంతో మున్సిపల్ కమిషనర్ రషీద్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వెంటనే సిబ్బందిని పంపించారు. దీంతో వారు వచ్చి ఆ కుక్కను వెంటాడి దానిని చంపేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తాం

మాజీ ఎంపీ నెలవల ● వాడవాడలా టీడీపీకి బ్రహ్మరథం





సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నెలవల - బీడీకాలనీలో విజయశ్రీ, విజయభాస్కర్‌రెడ్డి తదితరులకు కాలనీవాసుల సన్మానం

నాయుడుపేట/టౌన్, మే 4: వైసీపీ ప్రభుత్వం దుర్బుద్ధితో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చిందని ఆ చట్టం ద్వారా భూములు యజమానులకు కాకుండా పోతాయని అందుకే తమ అధినేత చంద్రబాబు ఆలోచించి దాన్ని రద్దుచేస్తానని హామీ ఇచ్చారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం తన స్వగృహంలో 100 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, యువకులు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... టీడీపీకి బీసీలే వెన్నెముకలాంటివారని టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల కోసం రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి వారికి తగిన భద్రత కల్పిస్తారని పేర్కొన్నారు. రూ.13 లక్షల కోట్లను జగన్ ప్రభుత్వం అప్పుచేసిందని ఆ డబ్బంతా ఏమైందని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వారి అవినీతిపై విచారణ చేయిస్తామన్నారు. ఆయనతోపాటు టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ, వంకా సుధాకర్ యాదవ్, రమణయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా టీడీపీకి బ్రహ్మరథం...

శనివారం నాయుడుపేట పట్టణంలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫి, కందల కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో బీడీ కాలనీ, ఎల్ఏసాగరం, శ్రీవారి మీసేవ సెంటర్, మార్కెట్‌వీధి, మంగపతి నాయుడునగర్, భరత్‌నగర్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎక్కడికక్కడ అభిమానులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ సర్వనాశనం అయిపోయాయన్నారు. అన్ని వర్గాలను ఈ ప్రభుత్వం మోసం చేసిందని పెరిగిన విద్యుత్, ఆర్టీసీ వంటి చార్జీలతో జనం అల్లాడిపోతున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే ఎన్డీఏ కూటమికి ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.శోభారాణి, టి.కన్నెమ్మ, ఎం.రాజశేఖర్, కె.వెంకటేశ్వర్లురెడ్డి, సుబ్రహ్మణ్యం, జి.ప్రభావతమ్మ, పి. గంగాప్రసాద్, పి.చెంగయ్య, జి.లక్ష్మయ్య, సుధీర్‌రెడ్డి, మస్తాన్, నానాబాల సుబ్బారావు, సుధీర్, కిషోర్, షేక్ కాలేషా, బీజేపీ నాయకులు అమరావతి రామయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న విజయశ్రీ, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

వైసీపీకి గుణపాఠం చెబుదాం





ప్రచారం నిర్వహిస్తున్న తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ సతీమణి కొల్లూరి లక్ష్మి - సమావేశంలో ప్రసంగిస్తున్న వరప్రసాద్

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 4: దళితులంటే వైసీపీకి చులకన భావమని ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు సతీమణి కొల్లూరి లక్ష్మి అన్నారు. శనివారం తిరుపతి నగరంలోని జీవకోనలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. భారీ ర్యాలీ నిర్వహిస్తూ ఈ ప్రచారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... తిరుపతిలో గత ఐదేళ్లల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఎక్కడ అభివృద్ధి జరక్కపోయినా తన భర్త వరప్రసాద్ ప్రాతినిధ్యం వహించిన గూడూరు నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించారన్నారు. ప్రజలతో మమేకమవడం గమనించిన వైసీపీ పెద్దలు గ్రహించలేక కావాలనే తమ భర్తను అవమానపరిచారన్నారు. అటువంటి అవమానాలను ఐదేళ్ల ప్రజల కోసం భరించారని ఇక ఉండలేక బయటకువచ్చారని ఇటువంటి పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. డాక్టర్ స్ఫూర్తి, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

హైలెవల్ కమిటీ సమావేశం...

స్థానికంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో బీజేపీ ఢిల్లీ ఎలక్షన్ ఆర్గనైజేషన్ కమిటీ హైలెవల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి అరుణ్‌సింగ్, ముఖర్జీ, రాష్ట్రఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రప్పతో కలసి వరప్రసాద రావు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేసి తిరుపతి ఎంపీ సీట్‌ను గెలిచేలా కూటమి పార్టీలను సమాయత్తం చేయాలని అందుకు నాయకులందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల విలువైన మోటర్ల చోరీ

నాయుడుపేట టౌన్, మే 4: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో మెకానిక్ దుకాణాల్లో రూ.4 లక్షల విలువైన మోటర్లు చోరీ అయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాత బస్టాండ్ సమీపంలో మెకానిక్ దుకాణం నిర్వహిస్తున్న ఫయాజ్ ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి దుకాణాన్ని మూసుకొని ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉండటం గమనించడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. దుకాణంలోకి వెళ్లి పరిశీలించగా రూ.3 లక్షల విలువైన మోటర్లు చోరీ జరిగినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. అలాగే ఈ దుకాణానికి సమీపంలో ఉన్న మరో దుకాణంలో కూడా రూ.లక్ష విలువైన మోటర్లు చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందింది.

ఉద్యోగులూ... మద్దతు తెలపండి

గూడూరు అర్బన్, మే 4: పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులు ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతు తెలపాలని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ శనివారం పేర్కొన్నారు. వైసీపీ పాలనలో జగన్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే టీడీపీ ధ్యేయం

నాయుడుపేట టౌన్, మే 4: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే టీడీపీ ధ్యేయమని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం చెప్పారు. మం డలంలోని పుదూరులో ఏ.మనోజ్‌కుమార్‌తోపాటు మరో 50 కుటుంబాలు వైసీపీని వీడి నెలవల, వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మాట ఇచ్చారని తెలిపారు.

డబ్బుకోసం దేన్నైనా తాకట్టు పెట్టేస్తాడు

● వెంపటి మాధవనాయుడు

డక్కిలి, మే 4 : డబ్బు కోసం సీఎం జగన్... తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలతో పాటు ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టేందుకు సిద్ధపడ్డాడని, మళ్లీ సీఎం చేస్తే ప్రజల ఆస్తులు కూడా తాకట్టు పెట్టేందుకు పథకం సిద్ధ చేసుకున్నాడని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి వెంపటి మాధవనాయుడు అన్నారు. శనివారం రాత్రి ఆయన పలుగోడులో ప్రచారం అనంతరం మీడియాతో మాట్లాడుతూ... జగన్ మళ్లీ గెలుస్తామన్న నమ్మకంతోనే ల్యాండ్ టైటలింగ్ యాక్టు తీసుకు వచ్చారన్నారు. గెలిచాక పాలన సాగించాలంటే డబ్బులు ఉండవు కాబట్టి ఆ యాక్టు ద్వారా ప్రజల భూములను విదేశీ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి ప్రభుత్వాని నడిపించాలని పన్నాగం పన్నాడన్నారు. ఇకపై ఒరిజినల్ పత్రాలు ప్రజల దగ్గర ఉండవన్నారు. రైతులు, దళితుల అసైన్డ్ భూములను లాగేసుకుంటారన్నారు.

వైసీపీ అసత్య ప్రచారం నమ్మొద్దు

ఎన్డీఏ కూటమితోనే ముస్లింల సంక్షేమం: బీద రవిచంద్ర ● కంత్రీ జగన్‌కు ఈ ఎన్నికల్లో ఓటమి: కురుగొండ్ల





చెన్నసముద్రంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రవిచంద్ర - టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో కురుగొండ్ల తదితరులు

వెంకటగిరి/ డక్కిలి, మే 4: ఎన్డీఏ కూటమిలో టీడీపీకి ఓటు వేస్తే మైనార్టీలకు అన్యాయం జరుగుతుందని వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ముస్లిం సోదరులు నమ్మవద్దని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. శనివారం ఆయన డక్కిలి మండలంలోని అముదూరు, తీర్థంపాడు, ఆల్తూరుపాడు, మిట్టపాళెం, నాగవోలు, పలుగోడుల్లో టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లల్లో మైనార్టీలకు చేసిన మేలు ఒక్కటైనా చెప్పాలని నిలదీశారు. చంద్రబాబు ఎన్డీఏ కూటమిలో ఆరేళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తే ఏ చిన్న సమస్య అయినా వచ్చిందా అని ముస్లిం సోదరులు ఒక్కసారి ఆలోచించాలని కోరారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో రంజాన్ తోఫా, పెళ్లికానుక, షాదీమహల్ నిర్మాణాలు, విదేశీ విద్య వంటి పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పదేపదే అబద్ధాలు చెబుతూ, సమస్యలు రాబోతున్నాయని మైనార్టీల్లో ఒక రకమైన అపోహను సృష్టిస్తున్న వైసీపీ తీరు మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కేంద్రంలో ఎవరున్నా రాష్ట్రంలో మైనార్టీలను కాపాడుకుని, వారికి సంక్షేమం, అభివృద్ధిని అందించే బాధ్యత తమదీ అని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ తెలిపారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వెంకటగిరిలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి పనులు తప్ప గడిచిన ఐదేళ్లల్లో ఒక్క పని కూడా జరగలేదని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి కంత్రీ జగన్‌ను చూసి రాష్ట్రంలో పరిశ్రమలు పారిపోతున్నాయని విమర్శించారు. ఎన్డీయే కూటమి మేనిఫెస్టోను నమ్మవద్దని జగన్ చెప్పెదాంట్లో అర్థం లేదన్నారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం స్వర్ణయుగంగా మారుతుందన్నారు. టీడీపీకి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల వంటివన్నారు. సంక్షేమం తోపాటు అభివృద్ధీ అవసరమన్నారు. సంపద సృష్టించుకుంటేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. అలా కాకుండా పంచుకొంటూ పోతే అప్పుల్లో కూరుకుపోతామన్నారు. ఈ ఎన్నికల్లో తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కు కమలం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కాగా అంతకు ముందు వెంకటగిరిలోని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ నివాసంలో దగ్గవోలు సర్పంచు మస్తాన్, మాజీ ఎంపీపీ రమణయ్య, పలువురు వార్డు మెంబర్లు, వెలికల్లు ఎంపీటీసీతో పాటు వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు రంగినేని వెంకటరమణయ్య, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, కురుగొండ్ల శేఖర్ నాయుడు, ఎస్ఎస్ఆర్ నాయుడు, రంగినేని క్రిష్ణయ్య, వేపమాను యువరాజ్, రంగినేని రాజా, గడ్డం చంద్రశేఖరరెడ్డి, మాధవరెడ్డి, ఎ.వి.రెడ్డి, కుమార్ యాదవ్, హరినాథ నాయుడు, తిరుపాల్, తెలుగుయుదత అధ్యక్షుడు కిషోర్, పోకూరు రమేష్, పి.పి. చౌదిరి, దగ్గవోలు వెంకటేశ్వర్లు, రాము, కాపా శ్రీనివాసులు నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్ చౌదరి, నాని, చంటి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడిని...పిలిస్తే పలికేవాడిని...ఆదరించండి: పాశిం





చెన్నూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ - మేగనూరులో ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తున్న పాశిం

గూడూరు, మే 4: స్థానికుడిని...పిలిస్తే పలికేవాడిని... అందరికీ అందుబాటులో ఉండేవాడిని ఈ ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపించాలని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ కోరారు. నిమ్మమార్కెట్, మండలంలోని మేగనూరు, చెన్నూరుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వచ్చానన్నారు. ఎన్నికల సమ యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని వాటిని నమ్మి మోసపోకుండా ఆలోచించి స్థానికుడినైన తనకు ఓటు వేయాలన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ఈ ప్రాంత సమస్యల పట్ల అవగాహన ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం సాగించిన అరాచక పాలనతో అన్ని వర్గాల ప్రజలు అల్లాడిపోయారన్నారు. సీఎం జగన్ నవరత్నాల పేరుతో నవమోసాలు చేశారన్నారు. ఎక్కడ రోడ్లు చూసినా గుంతలమయంగా అధ్వానంగా ఉండడం ఈ ప్రభుత్వ పాలనకు అభివృద్ధిపట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చిన్నపాటి గ్రామాల్లో సైతం సిమెంటురోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసీపీపాలనలో యువతను నిరుద్యోగులుగా మార్చి వారి జీవితాలతో జగన్ చెలగాటమాడారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మొదటి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. మేగనూరు, చెన్నూరుల్లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుని అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అమరేంద్ర, వెంకటేశ్వర్లురాజు,కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శ్రావణి, మురళి, హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయానికి సహకరించండి...



చదలవాడ హరిప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పాశిం

తన విజయానికి సహకరించాలని పాశిం సునీల్‌కుమార్ గ్రూప్‌థియేటర్ల వద్ద గ్రూప్‌థియేటర్ల అధినేత, బలిజ అభ్యుదయ సేవాసంఘం గౌరవాధ్యక్షుడు చదలవాడ హరిప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. మొదటి నుంచి బలిజ కులస్తులతో సఖ్యతగా వ్యవహరించేవాడినని అధికారంలోకి రాగానే వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పేటేటి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, భాస్కర్, మురళి, శ్రీను, ఎంవీరమణయ్య, శివకుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.